ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

గురువారం 9 జనవరి 2025



5

సాగునీటి ప్రక్షాళనకు శ్రీకారం

● నేడు ప్రాజెక్టు కమిటీ తొలి సమావేశం ● సత్తెనపల్లి జలవనరులశాఖ అతిథి గృహంలో నిర్వహణ ● కీలక నిర్ణయాలు తీసుకుంటేనే మేలంటున్నరైతులు

8



గోవిందాపురం మైనర్‌లో పెరిగిన రబ్బరు మొక్కలు

గుంతల రహదారికి మోక్షం



గోతుల మయంగా ఉన్న కొండమోడు రహదారి

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పనులను ప్రారంభించడంతో కొండమోడు - పేరేచర్ల జాతీయ రహదారికి మహర్దశ పట్టనుంది. రహదారి పనులకు నిధులు మంజూరు.. భూసేకరణ.. టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారుల అథార్టీ చర్యలు చేపట్టింది. దశాబ్దాలుగా కొండమోడు రహదారిని విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు. సత్తెనపల్లి - కొండమోడు మధ్య రహదారిపై పెద్దఎత్తున గోతులు ఉన్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణించేందుకు వాహనదారులు సాహసించడంలేదు. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు నరసరావుపేట నుంచి వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. మొత్తం మీద ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పనులకు శంకుస్థాపన చేయడంతో రహదారిని వేగవంతంగా విస్తరించేందుకు సాకారం ఏర్పడింది. పేరేచర్ల నుంచి కొండమోడు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఒక్కొక్క వైపు 8.75 మీటర్లు రహదారి నిర్మిస్తారు. 1.5 మీటర్లు డివైడర్.. రెండు వైపులా మార్జిన్లతో కలిపి మొత్తం 22.5 మీటర్ల వెడల్పుతో రహదారిని విస్తరిస్తారు. సుమారు 585 ఎకరాల భూమిని రహదారి విస్తరణ కోసం సేకరించారు. కేంద్ర ప్రభుత్వం రూ.882 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. మేడికొండూరులో సుమారు ఐదు కిలోమీటర్లు, సత్తెనపల్లి పట్టణానికి 11 కిలోమీటర్లు మేర బైపాస్ నిర్మించనున్నారు. కాంట్రాక్టర్‌ను ఖరారు చేయడంతో త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయి.

తీరంలో.. అనుసంధానం



ఎన్‌హెచ్ 216 జాతీయ రహదారి

(బాపట్ల - ఆంధ్రజ్యోతి)

జిల్లా పరిధిలోని 72 కిలోమీటర్ల మేర తీర ప్రాంతాన్ని కలుపుతూ జాతీయ రహదారి 216 విస్తరణ పనులను 2017లో కేంద్రం ప్రారంభించింది. రూ.786 కోట్ల వ్యయంతో 62.13 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టిన ఎన్‌హెచ్ 216 పనులు 2023లో పూర్తి కాగా 2024 నుంచి ప్రజలకు ఉపయోగంలోకి వచ్చింది. ఈ రహదారిని ప్రధాని విశాఖ వేదికగా జాతికి అంకితం చేశారు. రేపల్లె నుంచి ప్రారంభమయ్యే 216 రెండు వరుసల రహదారి భట్టిప్రోలు, చెరుకుపల్లి, కర్లపాలెం, బాపట్లతో పాటు చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలను అనుసంధానం చేస్తోంది. ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు అంచనా వ్యయం రూ.487 కోట్లుకాగా, నిర్మాణం పూర్తయ్యేనాటికి అది రూ.786 కోట్లకు చేరుకుంది. ఈ రహదారి వల్ల బాపట్లలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడుతుంది.

వైసీపీ ప్రభుత్వంలో నత్తనడకన..

2017లో ప్రారంభమైన 216 జాతీయ రహదారి పనులు రెండేళ్ల పాటు శరవేగంగా కొనసాగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనుల్లో వేగం లోపించింది. నిర్మాణ పనుల్లో జాప్యంతో తొలి అంచనాలకు మించి ఖర్చు అయింది. దీనికి తోడు భూసేకరణలో కూడా వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కారణమైంది. ప్రారంభించిన మూడేళ్ల వ్యవధిలోనే నిర్మాణం పూర్తి చేయాలని తొలుత లక్ష్యం నిర్దేశించుకున్నప్పటికీ ఎట్టకేలకు గతేడాది అది వాడుకలోకి వచ్చింది.

సాగర్ నుంచి మల్లాయపాలెం వరకు..

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ - దావులపల్లి జాతీయ రహదారిని 47 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. రూ.230 కోట్లతో పనులు పూర్తి చేయగా రహదారిని ప్రధాని ప్రారంభించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రహదారి నిర్మాణానిక సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. భూసేకరణ పనులు పూర్తయ్యాయి. రహదారి విస్తరణ పనులు వెనువెంటనే ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.



ప్రధాని ప్రారంభించిన నాగార్జున సాగర్ - దావులపల్లి రహదారి



జిల్లాకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను విశాఖపట్నం నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి మోదీ, వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత తదితరులు

పలు ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభం.. శంకుస్థాపన

కొండమోడు రహదారి, నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్‌కు మహర్దశ

చిలకలూరిపేట బైపాస్, దావులపల్లి, ఎన్‌హెచ్-216 రహదారులు జాతికి అంకితం

విశాఖపట్టణం నుంచి వర్చువల్‌గా శిలాఫలకాలను ఆవిష్కరించిన మోదీ

జాతికి అంకితం.. జిల్లా అభివృద్ధికి.. ఆవిష్కారం

రహదారులు జాతికి అంకితంతో పాటు వివిధ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం నుంచి బుధవారం ఆవిష్కరించారు. కొండమోడు రహదారి.. నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్.. పనులకు శంకుస్థాపన చేయగా చిలకలూరిపేట బైపాస్, దావులపల్లి, ఎన్‌హెచ్-216 రహదారులు జాతికి అంకితం చేశారు. ఒకే రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని వివిధ పనుల ప్రారంభోత్సవాలతో పాటు రహదారులను జాతికి అంకితం చేశారు. ఆయా పనులకు సంబంధించిన శిలాఫలకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి మోదీ ఆవిష్కరించారు. ప్రధాని స్వయంగా ప్రారంభించడంతో కొండమోడు రహదారితో పాటు నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్ పనులు శరవేగంగా పూర్తి అవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. కాగా బుధవారం మోదీ పనులకు శంకుస్థాపన దృశ్యాలను గుంటూరు, నడికుడి తదితర రైల్వేస్టేషన్లలో తెరలు ఏర్పాటు చేసి ప్రయాణికులు వీక్షించే సౌకర్యాన్ని కల్పించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే సరుకు రవాణాతో పాటు రైళ్ల వేగం కూడా పెరిగే అవకాశం ఉంది. దేశంలోనే మొదటి మోడల్ ప్రాజెక్టుగా చేపట్టిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డును ప్రధాని జాతికి అంకితం చేశారు. నాగార్జున సాగర్ - దావులపల్లి జాతీయ రహదారిని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించే పనులకు మోదీ ప్రారంభోత్సవం చేశారు. రేపల్లె నుంచి ఈపూరుపాలెం 216 రహదారితో రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాలకు అనుసంధానం ఏర్పడింది. బాపట్ల జిల్లా పరిధిలోని 62.13 కిలోమీటర్ల మేర 216 జాతీయ రహదారిని ప్రధాని జాతికి అంకితం ఇవ్వడం పట్ల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

పట్టాలెక్కిన డబ్లింగ్ ప్రాజెక్టు

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

గుంటూరు రైల్వే డివిజన్ దశ దిశ మార్చబోయే కీలకమైన నల్లపాడు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టు పట్టాలెక్కింది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి పింక్‌బుక్‌లో చేర్చిన రైల్వే శాఖ బుధవారం ప్రధానమంత్రి శంకుస్థాపన చేయించింది. రూ.2853.23 కోట్ల అంచనా విలువకాగల ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వేల మందికి ఉపాధి లభించనుంది. అలానే ప్రాజెక్టు పూర్తి అయితే తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ మధ్య రైలు కనెక్టివిటీ గణనీయంగా పెరుగుతుంది. వాణిజ్యపరంగానూ రెండు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలకు మేలు కలుగుతుంది. నల్లపాడు - బీబీనగర్ మధ్యన ప్రస్తుతం సింగిల్ లేన్ రైలు మార్గం అందుబాటులో ఉన్నది. దీని వల్ల లైన్ కెపాసిటీ 215కి చేరింది. దీంతో కొత్తగా రైళ్లను ప్రవేశపెట్టలేని పరిస్థితి నెలకొన్నది. గత ఏడాది ప్రకృతి విపత్తుల సమయంలో కాజీపేట మార్గానికి ప్రత్యామ్నాయంగా నల్లపాడు - బీబీనగర్ రైల్వేలైన్‌ని వినియోగించడంతో రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. కాగా ఈ మార్గాన్ని డబ్లింగ్ చేయాలని దశాబ్దాల తరబడి ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు ఎన్‌డీఏ-3 ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు మంజూరైంది. 238.99 కిలోమీటర్ల పొడవునా ఈ డబ్లింగ్ ప్రాజెక్టుని చేపడతారు. ఇందులో కృష్ణానదిపై మేజర్ బ్రిడ్జిని కూడా నిర్మించాల్సి ఉన్నది. అలానే వలిగొండ, నాగార్జునసాగర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్, మూసినదిపై వంతెనల నిర్మాణాలు చేయాలి. పగిడిపల్లి నుంచి కుక్కడం వరకు భూమి అందుబాటులో ఉండటంతో మూడు సెక్షన్లుగా విడగొట్టి పనులు చేపట్టేందుకు టెండర్లను కూడా రైల్వే శాఖ నిర్వహించింది. కుక్కడం - నడికుడి, కుక్కడం - వలిగొండ, పగిడ్డి - బొమ్మాయిపల్లి మధ్య ఇప్పటికే భూమి చదును పనులు మొదలయ్యాయి. మరోవైపున నడికుడి - నల్లపాడు మధ్య గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేయాల్సి ఉండగా రెండు జిల్లాల ఆర్‌డీవోలు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశారు. రైతుల వద్ద తీసుకోబోయే భూమికి అవార్డులు జారీ చేస్తే పనులు ప్రారంభించడానికి అవరోధాలు తొలగిపోతాయి. కనీసం 80 శాతం భూమి అందుబాటులోకి వస్తే పనులు ప్రారంభిస్తామని రైల్వేవర్గాలు తెలిపాయి.





బైపాస్‌తో కష్టాలకు చెక్

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

చిలకలూరిపేట బైపాస్ రహదారిని ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. రూ.907 కోట్లతో బైపాస్ నిర్మించారు. 16వ నెంబరు జాతీయ రహదారి బొప్పూడి సమీపం నుంచి తిమ్మాపురం వరకు బైపాస్ 16.384 కిలోమీటర్ల మేర నిర్మించారు. దేశంలోనే మోడల్ బైపాస్ ఇది. రహదారికి ఇరువైపులా శాశ్విత గోడ నిర్మించారు. బైపాస్ విశాలమైన ప్రాంతాల్లో ఒక మోగా వాట్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాత్రి వేళ రహదారిపై ఏర్పాటు చేసిన లైటింగ్‌కు వినియోగిస్తారు. దాదాపు 3,500 మొక్కలు నాటారు. బైపాస్‌తో చికలూరిపేట పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరాయి.

గ్రామాల్లో సంక్రాంతి శోభ
● పిండివంటల ఘుమఘుమలు
● అరిసెలు, లడ్డూ తయారీలో మహిళలు
● హరిదాసుల సందడి
● గ్రామాలకు చేరుకుంటున్న బంధువులు
8

రేపు నృసింహుని.. ఉత్తర ద్వార దర్శనం
● బంగారు దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థం
● ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సతీశ్‌కుమార్

అమరావతి పనులకు ఆమోదం
● మరో రూ.11,467 కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు ● ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు ఆమోదం
6

సంపూర్ణం అస్తవ్యస్తం



కేవీపీ కాలనీలో అసంపూర్తిగానే పాఠశాల భవనం

◆ నాడు నేడు పనులపై ఆడిట్ ◆ కాంట్రాక్టర్ల వెన్నులో వణుకు ◆ పేరుకు తల్లిదండ్రుల కమిటీలు ◆ పెత్తనం అంతా నాటి వైసీపీ నాయకులదే ◆ రూ.కోట్లు ఖర్చుచేసినా.. ఇంకా అసంపూర్తిగానే పనులు

గుంటూరు(విద్య),జనవరి 8(ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలల్లో అభివృద్ధి పేరుతో నాటి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన "నాడు నేడు" పనులపై ఆడిట్ చేయాలని నిర్ణయించడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు వణికిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వం "నాడు నేడు పథకం" పేరుతో ప్రారంభించిన పనులు అనేక చోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. రెండు దశల్లోనూ పనులు అస్తవ్యస్తంగా నిర్వహించారు. దీంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడై పోతున్నది. కొన్ని చోట్ల దొంగలపాలవుతున్న ఉదంతాలూ ఉన్నాయి.

అస్తవ్యస్తంగా పనులు అడ్డగోలు నిర్ణయాలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో నూతన తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్స్, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబులు, కిచెన్‌షెడ్లు, సైన్స్‌ల్యాబుల నిర్మాణం, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్ సౌకర్యం కల్పించడం, పాఠశాలలకు రంగులు వేయడం తదితర తొమ్మిది రకాల పనుల్ని "నాడు నేడు పథకం"లో చేపట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 వేలకుపైగా మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలలు, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్ని ఎంపిక చేశారు. ఇందుకోసం దాదాపు రూ. 1500 కోట్లకుపైగా నిధు లు కేటాయించారు. నిధులు సక్రమంగా ఖర్చుచేయకపో వడంతో ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ 45 శాతంపై పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వందల సంఖ్యలో భవనాలు ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పునాదుల స్థాయిలో మరికొన్నిచోట్ల శ్లాబ్ పూర్తి అయినా పార్టీషన్, ప్లాస్టరింగ్, విద్యుత్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదు. మరికొన్ని చోట్ల పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇలా వివిధ దశల్లో ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో భవనాలు ఉన్నాయి. ఆయా పనులపై తాజాగా ఆడిట్ నిర్వహిస్తారు.

బూడిదలో పోసిన పన్నీరులా నిధులు

పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం తీసుకువచ్చిన నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడైపోతోంది. ఇసుక, కంకర, డస్ట్ ఇప్పటికే అనేక స్కూల్స్‌లో మట్టిలో కలిసి పోయింది. సిమెంట్‌కు రక్షణ లేకపోడంతో గడ్డకట్టి ఉపయోగించడానికి వీలులేకుండా తయారైంది. ఇక శానిటరీ, ప్లంబింగ్, విద్యుత్ పరికరాలు పాఠశాలల్లోని తరగతి గదుల్లో పేరుకుని పోయి ఉన్నాయి. కొన్ని ఇప్పటికే ధ్వంసం కాగా, మరికొన్ని దొంగల పాలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కోట్లాది రూపాలయ ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అనేక స్కూల్స్‌లో ఇప్పటికి వాటర్‌ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్ పూర్తి అయినా వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఆడిట్ త్వరగా పూర్తిచేసి అసంపూర్తి పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పీవీ 13 రాష్ట్రాల ప్రజల ఆకలి బాధ తీర్చారు

● వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు



ఉత్తమ పరిశోధనా సంస్థలకు అవార్డులు అందజేస్తున్న వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి, యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని 13 రాష్ట్రాల ప్రజల ఆకలి బాధను తీర్చిన ఘనత ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణకు దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. డాక్టర్ పీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో వచ్చిన వరి వంగడాలు 13 రాష్ట్రాల్లోని 14.15 మిలియన్ హెక్టార్లలో సాగు అవుతున్నాయని అన్నారు. ఇంత గొప్ప పరిశోధకులు ఉండటం వ్యవసాయ యూనివర్సిటీ అదృష్టం అన్నారు. గుంటూరు సమీపంలోని లాంలో ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృష్ణా ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరగనున్న 54వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలు బుధవారం ఆరంభం అయ్యాయి. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఢిల్లీరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సునిశిత పరిశీలనతో సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుంటూ దానికి తగ్గ పరిశోధనని నూతనంగా ఆలోచించి పరిష్కారం చూపించాలని అన్నారు. వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి మాట్లాడుతూ 2023లో విశ్వవిద్యాలయం నుంచి తొమ్మిది కొత్త వంగడాలు రాష్ట్రస్థాయిలోనూ, 10 కొత్త వంగడాలు జాతీయస్థాయిలోనూ విడుదల కావడం గర్వకారణమన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివ నారాయణ మాట్లాడుతూ 26 విస్తరణ విభాగాల ద్వారా 2023-24వ సంవత్సరంలో చేపట్టిన వివిధ విస్తరణ కార్యక్రమాల వివరాలను ను తెలియజేశారు. కార్యక్రమంలో ఉత్తమ సామర్థ్యం చూపించిన సంస్థలను గుర్తించి, సత్కరించారు. కొన్ని పుస్తకాలను విడుదల చేశారు. పాడేరు ఏరువాక కేంద్రానికి చెందిన ఎఎస్ఆర్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఉత్తమ ప్రాంతీయ పరిశోధనాస్థానం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంగా - లాం, గుంటూరు, ఉత్తమ వ్యవసాయ పరిశోధనాస్థానంగా -ఎఆర్ఎస్, రాగోలు, ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా కేవీకే కొండెపూడి, ఉత్తమ ఏరువాక కేంద్రంగా- ఏరువాక కేంద్రం, ఏలూరు లను గుర్తించి సన్మానించారు. మాజీ పరిశోధన సంచాలకులు డా.ఏ.ఎస్. రావు, మాజీ అసోసియేట్ డీన్ డా.ఆర్.ఎల్.వాసంతి, మాజీ విస్తరణ సంచాలకులు డా.పి.రాంబాబు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్, పెదవేగి నుంచి డా.ఎం.వి. ప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త (విస్తరణ) తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో మరో రూ.11,467 కోట్ల పనులకు ఆమోదం

● 20 ఇంజనీరింగ్ పనులకు పరిపాలనా అనుమతులు
● ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు ఆమోదం
● సంక్రాంతి తర్వాత ఊపందుకోనున్న టెండర్ల ప్రక్రియ
● మార్చిలో పనులు ప్రారంభించే అవకాశం



విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సంబంధించి మరో రూ.11,467.27 కోట్ల విలువైన పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. రాజధానిలో అత్యంత కీలకమైన 20 ఇంజనీరింగ్ పనులకు బుధవారం ఆమోదం తెలిపింది. అమరావతిలో నిర్మాణ పనులకు సంబంధించి కిందటి కేబినెట్ సమావేశంలో రూ.21 వేల కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదం ప్రకారం అందులో సగం రూ.11,467.27 కోట్ల పనులకు తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. మిగిలిన సగం పనులకు మరికొద్ది రోజుల్లో పరిపాలనా అనుమతులు జారీ చేసే అవకాశం ఉంది. ఇప్పటి వరకు మొత్తం రూ.31 వేల కోట్ల పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. ఇప్పటికే అమరావతిలో రూ.20 వేల కోట్ల పైచిలుకు వ్యయంతో కూడిన పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. ఈ మేరకు సీఆర్‌డీఏ కూడా టెండర్ల ప్రక్రియను చేపట్టింది. ఇప్పటి వరకు రూ.10 వేల కోట్ల మేర పనులకు సీఆర్‌డీఏ, ఏడీసీలు టెండర్లు పిలిచాయి. దీంతో సంక్రాంతి తర్వాత అమరావతిలో నిర్మాణ పనులు జరగటానికి ఆస్కారం ఏర్పడింది. అమరావతిలో కీలకమైన ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులను రెండేళ్లలో పూర్తి చేసేలా నిర్దేశిస్తూ టెండర్లను పిలిచారు. మిగిలిన అన్ని పనులనూ మూడేళ్లలో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)ల నుంచి తీసుకున్న అప్పులతో రాజధాని పనులను పరిగెత్తించేందుకు సీఆర్‌డీఏ టెండర్లు పిలుస్తోంది. సంక్రాంతి నాటికి రాజధానిలో రూ.43 వేల కోట్ల మేర పరిపాలనా ఆమోదాలు పూర్తి చేసుకుని మార్చిలో పనులు పురోగతిలోకి వచ్చే అవకాశం ఉంది.

ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఏఐవైఎఫ్ నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో నిరుద్యోగ సమస్య నానాటికి పెరిగిపోతుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో బుధవారం 21వ ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ జరిగింది. సభకు సీపీఐ నాయకులు జంగాల చైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని అన్నారు. ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వం యువతను భావోద్వేగాలతో రెచ్చగొట్టి అ శాంతి పరిస్థితులను సృష్టించడం తప్ప, దేశంలోని యువతకు కావాల్సిన ఏ ఒక్క ప్రయోజనకర విధానాలను తీసుకురాలేదని విమర్శించారు. రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేయలేదని, దీంతో నిరుద్యోగం పెరిగిపోతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ముఖ్యంగా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కొత్తపేట బోస్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు బందేల నాసర్ జీ, షేక్ సుభాని, మహంకాళి సుబ్బారావు, షేక్ గని, జాన్సన్ బాబు, కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ జె.వెంకటమురళి



పర్యాటకశాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 08 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చారిత్రక సంపదను భద్రం చేస్తూ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకటమురళి కోరారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పర్యాటకశాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాకతీయులాంటి దేవాలయాలు, చోళుల నాటి దేవస్థానాలు వారసత్వ సంపదగా బాపట్ల జిల్లాలో ఉన్నాయని, వాటిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. చినగంజాం మండలంలో కాకతీయుల నాటి మోటుపల్లిబీచ్ వద్దనే వీరభద్ర స్వామి ఆలయం, ఆనాటి అభయ శాసనం ఆలయం ఉందని వివరించారు. 2వేల సంవత్సరాలు క్రితం నాటి బుద్ద స్తూపం భట్టిప్రోలు మండలంలో ఉందన్నారు. వేటపాలెం మండలంలో సుమారు 200 సంవత్సరాలు నాటి సారస్వత గ్రంధాలయం ఉందన్నారు. మహాత్మాగాంధీ ఇక్కడకు వచ్చి పరిశీలించినట్లు వివరించారు. బాపట్ల పట్టణంలో వెయ్యి ఏళ్ళ క్రితం చోళులు నిర్మించిన శ్రీ మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం ప్రాచుర్యంలో ఉందన్నారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో పర్యాటకులు బోట్లతో షికారు చేయటానికి సౌలభ్యంగా ఉందన్నారు. పర్యాటకశాఖ ద్వారా నిధులు కేటాయించి వీటిని అభివృద్ధి చేస్తే బాపట్ల జిల్లా పర్యాటక ప్రాంతంగా మారనుందని తెలిపారు. సూర్యలంక మండల బీచ్‌ని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. దుస్తులు మార్చుకోవటానికి, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తే మరింత ప్రయోజనం ఉంటుందన్నారు. బీచ్‌లో హెచ్‌పివి పైపు ఏర్పాటుతో పర్యాటకులు సురక్షితంగా సముద్రంలోకి మునగటానికి వీలుగా ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలన్నారు. సమావేశంలో పర్యాటకశాఖ ఆపరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి, శివశరం పాల్గొన్నారు.

రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



పొన్నూరుటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ జిల్లా అధికారులను కోరినట్లు బుధవారం తెలిపారు. ఇటీవల జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజను కలిసి ధాన్యం కొనుగోళ్లపై చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల ముందు ఉంచినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లను పొన్నూరు నియోజకవర్గంలో నిలిపివేసినట్లు చెప్పారు. ధాన్యంకు సంబంధించి పేమెంట్లు ప్రభుత్వం తక్షణమే చెల్లిస్తుందని కానీ ధాన్యం కొనుగోలు నిలిపివేయడం వలన రైతుల వద్ద అధిక సంఖ్యలో ధాన్యం నిల్వలు ఉన్నట్లు చెప్పారు. రైతులు తమ ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను సంప్రదిస్తే అలాట్మెంట్ లేదని అధికారులు చెప్పటం సరికాదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని రైతుల పండించిన ధాన్యం వివరాలను సేకరించి మొత్తం ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేబ్రోలు, పొన్నూరు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జాయింట్ కలెక్టర్ భార్గవతేజ ధాన్యం కొనుగోళ్లు మొత్తం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వంతో సంప్రదించనున్నట్లు తెలియజేశారు.

10, 11, 12న నరెడ్కో మెగా ప్రాపర్టీషో-2025



ప్రాపర్టీ షో వివరాలు వెల్లడిస్తున్న నాయకుడు తిరుపతిరావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నరెడ్కో కాపిటల్ జోన్, గుంటూరు 12వ మెగా ప్రాపర్టీషో ఈ నెల 10, 11, 12 తేదీల్లో చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ గద్దె తిరుపతిరావు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రాముఖ్యత, ఆకర్షణను పెంచుతుందనీ, ప్రాపర్టీషోకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నట్లు వివరించారు. ప్రాపర్టీ షో కార్యక్రమంలో మంత్రి నారాయణ, లోకల్ ఎమ్మెల్యేలు, తదితర ప్రముఖులు కూడా పాల్గొంటారని తెలిపారు. జనవరి 12న ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. నారెడ్కో చైర్మన్ హీరానందని, నేషనల్ ప్రెసిడెంట్ గడ్డిపాటి హరిబాబు, స్టేట్ ప్రెసిడెంట్ చక్రధర్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాపర్టీషోలో 150 స్టాల్స్ ఏర్పాటు చేశామని, వీటిలో బిల్డర్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మామిడి సీతారామయ్య, క్యాపిటల్ జోన్ ప్రెసిడెంట్ నాగవంశీ, సెక్రెటరీ శ్రీనాథ్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గుంటూరు కళాపరిషత్ నాటక సంబరాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలోకం పెద్దబ్బయ్య, నాయుడు గోపి

గుంటూరు(తూర్పు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరు కళా పరిషత్ వార్షిక నాటక సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ గౌరవ సలహాదారుడు ఆలోకం పెద్దబ్బయ్య, ఉపాధ్యక్షుడు నాయుడు గోపి తెలిపారు. విజ్ఞాన మందిరం ఆవరణలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాటికలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. 10న సిటీ వాకర్స్ అసోసియేషన్ గుంటూరు వారిచే 'స్వేచ్ఛ', శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరి వారిచే 'జనరల్ బోగీలు', కళానికేతన్ వీరన్నపాలెం వారిచే 'ఋతువులేని కాలం', 11న గంగోత్రి, పెదకాకాని వారిచే 'అష్టమ వసువు', 12న మిత్ర క్రియేషన్స్ హైదరాబాదు వారిచే 'మట్టిమనిషి' సాంఘిక నాటికలను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. ప్రదర్శనలతోపాటు ప్రతిరోజూ సభా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలు 10, 11 తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు, 12న ఉదయం 10 గంటలకు సి.నాగభూషణం నటప్రస్థానం సదస్సు జరుగుతుందని చెప్పారు. నాటకాలను తిలకించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పరిషత్ సభ్యులు పి.మల్లికార్జునరావు, బి.పూర్ణ, గుమ్మడి నాగేశ్వరరావు, షేక్ సైదా, ఆవుల సుబ్బారావు, రావుల అంజి బాబు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో 169 మంది ఎంపిక

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షల్లో బుధవారం 169 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. మొత్తం 305 మంది హాజరు కాగా 74 మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. ఒకరు పరుగుపందెంలో పాల్గొనలేదు. మిగిలిన 206 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 24మంది ఛాతి, ఎత్తు తదితర కొలతలు సరిపోకపోవడంతో వల్ల తిరస్కరింపబడ్డారు. మిగిలిన 242 మందికి 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహించగా 27మంది విఫలమయ్యారు. 179 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 100మంది అర్హత సాధించారు. కాగా 179మందికి లాంగ్‌జంప్ నిర్వహించగా వారిలో 169మంది అర్హత సాధించగా 11మంది విఫలమయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఉపకులపతి ఎంపికకు సెర్చ్ కమిటీ నియామకం

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) ఉపకులపతిని ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమించింది. మొత్తం ముగ్గురి పేర్లను సూచించాల్సిందిగా ఆదేశించింది. సెర్చ్ కమిటీలో డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పూర్వ వీసీ డాక్టర్ సీవీ రావు, గీతమ్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కే శివరామకృష్ణ, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి ఆచార్య సంజీవ్ జైన్‌ని నియమించింది. ఈ త్రిసభ్య కమిటీ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని ఈ ముగ్గురి పేర్లను సిఫార్సు చేస్తుంది. ఆ ముగ్గురిలో ఒకరిని వీసీగా ఎంపిక చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ సెక్రెటరీ కోన శశిధర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయాలి

● అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ

గుంటూరు (తూర్పు) జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయాలని, సమ్మె కాలపు ఒప్పం దాలను అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరాయి. ఈ దీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ జిల్లాలో 39 వర్కర్స్, 66 హెల్పర్ల మొత్తం 105 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గత ఏడాది కాలంగా ఐసీడీఎస్ అధికారులకు, కలెక్టరుకు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికి సమస్య పరిష్కరించకపోవడం వల్లే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని అన్నారు. జిల్లా మినహా మిగతా రాష్ట్ర మంతటా ఖాళీ పోస్టులను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టినప్పటికీ మన జిల్లాలో ఈ ప్రక్రియ చేపట్టకపోవడానికి కారణాలేంటని ప్రశ్నించారు. జిల్లాలో అనేకచోట్ల అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకి ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలసి కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పలు సంఘాల నాయకులు దండా లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, బి శ్రీనివాసరావు, అంగన్‌వాడీలు దీప్తి మనోజ, వెంకాయమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

దాచేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని దారం ఆదిలక్ష్మి (29) అనే వివాహిత ఇంట్లో సరుకులు తెచ్చుకునేందుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం దాచేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లిలోని చేపలగడ్డకు చెందిన దారం నరేష్ భార్య ఆదిలక్ష్మి ఇంట్లోకి సరుకులు తెచ్చుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె 5.2 అడుగుల ఎత్తు ఉండి, నలుపురంగులో ఉంటుందని వివరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 566.60 అడుగులు ఉంది. ఇది 248.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 20,222 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 43,444 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

70,663 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 68,127 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 70,663 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,849 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7200	14000	334	7500	13500
నంబరు. 5	8500	11000	నంబరు. 5	8000	11500
273	7500	9000	273	--	--
341	8500	15800	341	9000	14000
4884	8000	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7800	16500	తేజ	8000	16000
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	9500	11500
దేవనూరుడీలక్స్	9500	14500	దేవనూరుడీలక్స్	13000	13000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9500

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కడియం బాలయ్య (ఫైల్‌ఫొటో)

ఈపూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దుస్సాన్‌పేట తండా వద్ద బుధవారం జరిగింది. బొల్లాపల్లి మండలం మూగచింతలపాలెం గ్రామానికి చెందిన కడియం బాలయ్య(45) పొలంలో చేసిన పనులకు సంబంధించి కూలి డబ్బుల కోసం దుస్సాన్‌పేట తండాకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. బాలయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వినుకొండ వైపు వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో బాలయ్య రోడ్డుపైన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నేటి నుంచి అనంత భోగేశ్వర స్వామి వార్షికోత్సవాలు

కొల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వరస్వామి 910వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎన్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ప్రతిష్టా మహోత్సవాలు జరుగుతాయన్నారు. 11న భక్తుల కు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మ హోత్సవ కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మండలపరిషత్ సమావేశం వాయిదా

● ఎంపీటీసీలు, సర్పంచులు డుమ్మా

కర్లపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలపరిషత్ సర్వసభ్య సమావేశం రెండోరోజు కూడా సమావేశం జరగకుండా వాయిదాపడింది. మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ఎంపీ డీవో అద్దూరి శ్రీనివాసరావు మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేయగా ఎంపీటీసీలందరు, సర్పంచులు 15మంది గైర్హజరయ్యారు. సమావేశంలో కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియపరుస్తామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

లబ్ధిదారులు ఇళ్ళవద్దే ఉండాలి



లబ్ధిదారులను సర్వే చేస్తున్న వైద్య బృందం

పిట్టలవానిపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో హెల్త్‌పెన్షన్లు రూ.15 వేలు తీసుకునే లబ్ధిదారులు 13మంది ఉన్నారని ఈ విషయమై గుంటూరు వైద్యబృందం బుధవారం సర్వే నిర్వహించింది. ఈ సర్వే కార్యక్రమంలో భాగంగా పిట్టలవానిపాలెంలో -3, భవనవారిపాలెం-4, చందోలు-2లో ఒకటి, అల్లూరులో-1, జీఎన్‌పాలెంలో-1, పిట్టువారిపాలెంలో -2, ఖాజీపాలెంలో-1 చొప్పున వీటిని గుర్తించినట్లు వైద్యబృందం గుర్తించారు. ఈసర్వే నిమిత్తం లబ్ధిదారులు సంబంధిత గృహాల్లో ఉండాలని తెలిపారు.

రేపు జిల్లా విద్యా సదస్సు

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన సూర్యకాళీఫంక్షన్ ప్లాజాలో జిల్లా విద్యాసదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం తెలిపారు. నూతలపాటి పరమేశ్వరరావు తృతీయ వర్ధంతి సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నరేంద్రవర్మ, డీఈవో ఎస్ పురుషోత్తం, సమగ్రశిక్ష ఏపీసీ ఎం నాగిరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు సీహెచ్ మంజుల, షేక్ జిలానీ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కావున ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, ఏ శేఖర్‌బాబు, కార్యవర్గ సభ్యులు బుధవారం తెలియజేశారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

పిట్టలవానిపాలెం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఖాజీపాలెం గ్రామ పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో-2 కె.రాజారత్నం సం దర్శించి బుధవారం పాఠశాలలను రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాల గురించి విద్యార్థులతో చదివించి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజన పథకాన్ని సమయపాలన పాటించి వారికి అందజేయాలని తెలియజేశారు.

సత్యసాయి స్కూల్ వ్యవస్థాపకుడు గోపాలరావు మృతి

రేపల్లె, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో శ్రీభగవాన్ సత్యసాయిహైస్కూల్ వ్యవస్థాపకులు కొండపనేని వెంకటగోపాలరావు(88) బుధవారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, మాజీమంత్రి మోపిదేవి వెంకటరమణారావులు తమ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన మృతదేహానికి మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు మద్రాస్ సాంబశివరావు, రామకృష్ణ తదితరులు నివాళులర్పించారు.

ఈడబ్ల్యూఎస్ బీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నగరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలు, ఈడబ్ల్యూఎస్ కులాల వారికి రుణాలను అందిస్తున్నట్లు నగరం మండలం ఎంపీడీవో బి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని బీసీలకు 15రకాల రుణాలను అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈడబ్ల్యూఎస్ కులాలకు కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య జనరిక్ కింద మరో రెండు రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ రుణాలకు సంబంధించి దరఖాస్తులను ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ కోటాలో నమోదు చేయించుకోవాలని సూచించారు.

పేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలి

బాపట్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అర్హులైన పేదలకు ఇళ్ళస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ సీనియర్ నాయకులు శ్రీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని 3, 4, 5 వార్డుల్లో బుధవారం ఇల్లులేని పేద ల నుంచి అర్జీలు పూర్తి చేయించి తీసుకున్నారు. ఈనెల 10వతేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, బీకేఎంయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జలవనరుల సంరక్షణ, పంటకాల్వల బలోపేతానికి రూ.9.28 కోట్లు కావాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో వివరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి పక్కన జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జలవనరుల సంరక్షణ, పంటకాల్వలు, చెరువు గట్ల బలోపేతానికి రూ.9.28 కోట్ల నిధులు అత్యవసరంగా కావాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సాధికారిత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌పీ సిసోడియా అమరావతి నుంచి బుధవారం కలెక్టర్‌తో వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాపట్ల నుంచి కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరులో బాపట్ల జిల్లాలో వరద విపత్తు నిర్వహణ గురించి వివరించారు. విపత్తు సమయంలో ఎదుర్కొన్న అంశాలపై వివరాలు తెలియజేశారు. కృష్ణానది వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని బాపట్ల జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో నిస్వార్థంగా పని చేసిందని కలెక్టర్ వివరించారు. ఆగస్టు నెలలో రూ.2కోట్లు, సెప్టెంబరు నెలలో మరో రూ.5కోట్ల నిధులు బాపట్లజిల్లాకు విడుదలయ్యాయన్నారు. కృష్ణానది వరద విపత్తుతో జిల్లాలో వేలాదిమంది నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పించి సహాయక చర్యలు చేపట్టామన్నారు. వరద విపత్తు సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుమతుల మేరకు కాల్వల గట్లు, చెరువుల కట్టలు బలోపేతం చేయటానికి ప్రతిపాదనలు పంపామన్నారు. స్పందించిన ఎండీ సిసోడియా తక్షణమే నిధులు విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్, అగ్నిమాపక విపత్తుల నిర్వహణ, నివారణాధికారి మాధవనాయుడు, ఉద్యాన శాఖ జిల్లాఅధికారి జే జెన్నెమ్మ, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటినిర్మాణానికి రూ.2.5లక్షలు ఆర్థికసాయం

జిల్లాలో అర్హులైన పేదలందరు పీఎంఏవై 2.0 పథకం కింద ఇల్లు నిర్మించుకోవటానికి కేంద్ర ప్రభుత్వం రూ.2.5 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. విజన్ బాపట్ల-2047 అమలు ప్రణాళికపై 14 శాఖల అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా యూడీఏ పరిధిలో ఉన్నందున అర్హులైన పేదలందరికీ పీఎంఏవై పథకం వర్తిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకునేలా విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో లక్ష గృహప్రవేశాల కార్యక్రమం సందర్భంగా జిల్లాలో గృహాల ప్రస్తుత పరిస్థితిపై కలెక్టర్ ఆరాతీశారు. గృహాలు పూర్తికానిచోట లక్ష్యాలను పూర్తి చేసేలా మండలాధికారులు ప్రత్యేకాధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీవో శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నేడు కేంద్ర బృందం పర్యటన..

దేశస్థాయిలో ఒకేజిల్లా ఒకే ఉత్పత్తి అనే నినాదంతో బాపట్లజిల్లా చీరాల సిల్క్‌శారీస్ ఉప్పాడ వస్త్రాలను ఎంపిక చేయటానికి కేంద్రబృందం గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఒకేజిల్లా, ఒకే ఉత్పత్తి బృందం పర్యటన వివరాలను చేనేత, జౌళీ శాఖాధికారులు కలెక్టర్‌కు వివరించారు. చీరాల సిల్క్‌శారీస్‌ను ఉప్పాడ జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపిక చేయటానికి కేంద్రబృందం పర్యటిస్తుందన్నారు. కేంద్రబృందం సభ్యులు ఇష్‌దీప్, డ్రాదివ్య విజయవాడ నుంచి బయలుదేరి బాపట్లజిల్లా కేంద్రానికి ఉదయం 10గంటలకు చేరుకుంటారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసిన ప్రదర్శన పరిశీలిస్తారన్నారు. సమావేశంలో చేనేత, జౌళీశాఖ జాయింట్ డైరెక్టర్ కె.కన్నబాబు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ భీమయ్య పాల్గొంటారని కలెక్టర్ వివరించారు.

తొలగించిన భూములు పునఃపరిశీలన చేయాలి

● సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జె.లక్ష్మీ

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములను పునఃపరిశీలన చేయాలని సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జె.లక్ష్మీ తెలిపారు. అమరావతి నుంచి ఆమె బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించగా బాపట్ల నుంచి కలెక్టర్ జె.వెంకటమురళి హాజరయ్యారు. నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలిగించిన భూములు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయ్యాయా లేదా అనేది పరిశీలించాలని చెప్పారు. ఇప్పటివరకు బాపట్ల జిల్లాలో 78.84శాతం పరిశీలించారన్నారు. మిగిలినవాటిని యుద్ధప్రాతిపదికన పరిశీలించాలన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన దుకాణాలు.. తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశాలు

● మార్కెట్‌ను సందర్శించిన వేగేశన

● సమస్యల పరిష్కారానికి చర్యలు



రైతుబజారులోని చిరువ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్ దగ్గర కొంతకాలంగా నెలకొనియున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులు, నాయకులతో కలిసి బుధవారం తెల్లవారుజామున మార్కెట్ పరిసరాల్లో పర్యటించారు. హోల్‌సేల్ వ్యాపారులు రోడ్లపై కూరగాయలు పోసి విక్రయిస్తుండగా రైతుబజారులోని చిరువ్యాపారులు కూడా దుకాణాలు వదిలేసి రోడ్లపైకి వచ్చి కూరగాయలు విక్రయిస్తున్నారు. దీనిని పరిశీలించిన ఎమ్మెల్యే తక్షణమే వాటిని దుకాణాల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. రోడ్లమీద విక్రయాలు జరపరాదన్నారు. బయట ఉన్న ఆక్రమణలు మొత్తం తొలిగించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డికి తెలియజేశారు. రోడ్లపై విక్రయాలు నిర్వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. హోల్‌సేల్ వ్యాపారుల కోసం జీబీసీరోడ్డులోని విలియంబూత్ జూనియర్ కళాశాల పక్కనే ఉన్న ప్రభుత్వభూమిలో ఏర్పాటు చేసుకునేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆప్రాంతాన్ని అధికారులతో పరిశీలించి చదును చేసి అందుబాటులో ఉంచాలని కమిషనర్‌ను ఆదేశించారు. జీబీసీరోడ్డులోని డ్రైనేజిని పరిశీలించి మురుగునీరు డ్రైన్‌లో వెళ్ళకుండా రోడ్డుపై ఉండటం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీపీవో ఎస్ మల్లికార్జునరావు, మున్సిపల్ ఏఈ డి.ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు శివరామకృష్ణ, షేక్ ఇమామ్, శానిటరి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

విపత్తుల సమయంలో రెడ్‌క్రాస్ సొసైటీవారు అందించే సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఇండియన్‌రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రీరామ్ సేవా సంకల్ప్ ఫౌండేషన్ చెన్నైవారి ఆర్థిక సహకారంతో రూ.12.5లక్షలతో ఏర్పాటు చేసిన ఈకేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి పేదలకు రెడ్‌క్రాస్ కిట్‌లు పంపిణి చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణ భట్టు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవలకు ముందుగా గుర్తొచ్చేది రెడ్‌క్రాస్ అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందుండి సేవలందిస్తుందన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు రక్తం అందించేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేయటం సంతోషదాయకమన్నారు. రెడ్‌క్రాస్ సేవకులు సైన్యంలా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్ సేవాసంకల్ప్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ మొగలేశ్వరరావు, వీరరాఘవయ్య, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, టీడీపీ స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.

కాల్వల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

● చివరి భూములకు సాగు నీరు అందించటమే లక్ష్యం

● పంతాని మురళీధర్



రేవేంద్రపాడు-రేపల్లె పంటకాల్వను పరిశీలిస్తున్న పంతాని మురళీధ రరావు

రేపల్లె, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సాగునీటి కోసం రైతుల కష్టాలను అధిగమించేందుకు కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాంతంలో పంటకాల్వలు, డ్రెయిన్ల అభివృద్ధికోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి రానున్న వేసవిలో అభివృద్ధి చేస్తామని కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు అన్నారు. బుధవారం రేవేంద్రపాడు లాకులు రేపల్లెకు వచ్చే ప్రధాన పంటకాల్వలను డ్రైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పంటకాల్వలు, డ్రైన్‌లు కనీసం ఓఎన్‌ఎం నిధులతోనైన అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. దీంతో పంటకాల్వలు పూడిపోయి ఎక్కడికక్కడ కట్టలు కోతకుగురై లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దీంతో ఈ కాల్వల పరిధిలోని రైతులకు చివరిభూముల వరకు సాగునీరందక కోట్లాది రూపాయలు నష్టపోవటంతో పాటు కొంతమంది ఆయిల్ ఇంజన్ల మోటార్ల ద్వారా అధికంగా డబ్బులు వెచ్చించి సాగునీరు తెచ్చుకునే పరిస్థితి నెలకొందని అన్నారు. వాటన్నింటికి చెక్‌పెట్టేందుకే మరమ్మతులు చేయవలసిన డ్రె యిన్‌లను వాటిని పరిశీలిస్తు న్నామన్నారు. రానున్న వేసవిలో మొదట్నించే కాల్వల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తద్వారా చివరిభూముల వరకు సాగునీరు అందిస్తామన్నారు. అధిక వర్షాల కారణంగా పంట పొలాల్లోని వర్షపునీరు డ్రెయిన్‌ల ద్వారా బయటకు వెళ్ళే పరిస్థితి లేదని ఎక్కడ ఏ డ్రైన్‌లు మరమ్మతులు చేయాలనే దానిపై దృష్టిసారించామని పూడుకుపోయిన డ్రెయిన్లు, విపరీతంగా పెరిగిపోయిన గుర్రపుడెక్కను తొలగించి మురుగునీరు పారుదలయ్యేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్, నీటిపారుదలశాఖ ఏఈలు పాల్గొన్నారు.

● **నగరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):** వెల్లటూరు డీసీ కెనాల్ పరిధిలోని ఆయకట్టు చివరి పొలాల రైతుల వరకు సాగునీటిని అందించటమే లక్ష్యంగా ఈ సమావేశం బుధవారం నిర్వహించారు. 2025-26వ సంవత్సరానికి సంబంధించిన పంటకాల్వలు, డ్రైనేజీకాల్వల మరమ్మతులపై జరిగిన సమావేశంలో కాల్వల మరమ్మతులు, అభివృద్ధి నీటిపారుదల సౌలభ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సభ్యులంతా ఏకగ్రీవంగా అభివృద్ధి పనులకు మద్దతు ప్రకటించారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ నీలం సువర్చల, డ్రైనేజీ ఏఈ నత్తల రాంబాబు, నీటిసంఘం ప్రెసిడెంట్‌లు సంఘం సభ్యులు బినేష్‌కుమార్, అందేవీరరాఘవయ్య, వెలగపూడి రవిప్రసాద్, చింతల వీరయ్య పాల్గొన్నారు.

సారా తయారుచేస్తే ఉపేక్షించం

● ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్

● 250 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రేపల్లె, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో సారా తయారుచేస్తే ఉపేక్షించేది లేదని నగరం ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. బుధవారం నిజాంపట్నం మండలం దిండి అదవల పంచాయతీల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండుచోట్ల సారా తయారీ కోసం ఉం చిన బెల్లం ఊటను ధ్వంసం చేసి వస్తువులను స్వాధీనం పరుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారుచేసిన అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తులతో స్వైరవిహారం.. ఇద్దరికి గాయాలు

బాపట్ల జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపేటలో ఇద్దరు వ్యక్తులు కత్తులతో స్వైరవిహారం చేసి ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిన ఘటన కలకలకలం రేపింది. పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం అర్ధరాత్రి కట్టా యోహన్, షేక్ ఫిరోజ్‌లు వస్తుండగా రహీం, జాకీర్‌లు ఎదురొచ్చి ముమ్మల్ని పిలవకుండా ఎక్కడికి వెళ్లి తాగి వస్తున్నారంటూ వాదనకు దిగారు. మీకెందుకు అని ప్రశ్నించటంతో నరుకుతామని కత్తులు తీయటంతో ఫిరోజ్ పరారయ్యాడు. యోహన్‌ను కత్తితో పొడిచారు. అదేసమయానికి ఫిరోజ్ బాబాయ్ షేక్ దత్తగిరిబాషా అక్కడకు వచ్చి ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించటంతో అతడిని కూడా గాయపరిచారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

అవినీతిపై విచారణ

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతిపై జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి నేతృత్వంలో విచారణ చేపట్టారు. బుధవారం భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో రూ.2.30 కోట్లు నిధుల దుర్వినియోగం ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా పంచాయతీరాజ్ ఉపకమిషనర్ నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 2019-2024 సంవత్సరాల మధ్య కాలంలో గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం అయినట్లు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు ఫిర్యాదుతో 25 మంది సభ్యులు, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు నేతృత్వంలో ఎంపీడీవో ఉన్న రికార్డులను పరిశీలించారు. అనంతరం విచారణ పూర్తి చేసి నివేదికను కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

హైవెండ్ హైస్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



హైవెండ్ హైస్కూల్లో చిన్నారులు వేసిన ముగ్గులు

కర్లపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం హైస్కూల్లో బుధవారం విద్యార్థులు చేసిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. పాఠశాలలోని చిన్నారులు అందరు వందల సంఖ్యలో గాలిపటాలను కర్లపాలెంలో ఎగురవేయటంతో ఆకాశంలో పలురంగుల గాలిపటాలతో శోభయామనంగా కనువిందు చేశాయి. ఈ క్రమంలో భాగంగానే పాఠశాల క్రీడాప్రాంగణంలో చిన్నారులు పలు రంగులతో తీర్చిదిద్దిన ముగ్గులు చూపరులకు కనువిందు చేశాయి. ఈ క్రమంలో భాగంగానే సంప్రదాయ కోడిపందాలను క్రీడాప్రాంగణంలో నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణంలో గురువారం కూడా సంక్రాంతి సంబరాలు ఉంటాయని ఎండీ సాయి మహేంద్రబాబు తెలిపారు. కార్యక్రమాలన్నింటిని చైర్మన్ ఉదయచంద్రరావు ఆధ్వర్యంలో డైరెక్టర్ చాందిని, వెంకటజ్యోతి, ఆంజనేయప్రసాద్‌లు పర్యవేక్షించారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

● దక్షిణావృత శంఖుతీర్థం వినియోగం

వేమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జంపనిలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన చెన్నకేశవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున చెన్నకేశవస్వామికి గోదా అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం ధనుర్మాస పూజ, తిరుప్పావై నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఉత్తర ద్వార పూజ అనంతరం శ్రీభూసహితుడైన శ్రీచెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను గరుత్మంత వాహనంపై ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. ఈ సందర్భంగా దక్షిణావృత శంఖం ద్వారా తీర్థజలాన్ని భక్తులకు వినియోగిస్తామన్నారు. మండలంలోని పెరవలి కేశవ మాధవ ఆలయం, చావలిలోని వేణుగోపాలస్వామి ఆలయం, వేమూరులోని వేణుకేశవ వేణుగోపాలస్వామి ఆలయాల్లో వార్షిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భట్టిప్రోలు (కొల్లూరు): ముక్కోటి, శివముక్కోటి పురస్కరించుకుని ఆయా పర్వదినాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబు బుధవారం తెలిపారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవార్లను దర్శించుకోవచ్చని చెప్పారు.

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రెండు ప్రాజెక్టులు



మక్కెనవారిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు, నరసాయపాలెం గురుకుల పాఠశాల విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న అధికారులు

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతస్థాయి విద్యవైజ్ఞానిక ప్రదర్శనకు బాపట్ల జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈవో ఎస్ పురుషోత్తం తెలిపారు. బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విద్యవైజ్ఞానిక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభను చూపి బాపట్ల జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు వివరించారు. మక్కెనవారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ సాయిరాంధీరజ్, కె.వెంకటేష్‌లు గ్రూప్ విభాగంలో రూపొందించిన మల్టీపర్పస్ అగ్రికల్చర్‌మిషన్ ఎంపికైంది. అదేవిధంగా నరసాయపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని డి.ప్రత్యూష వ్యక్తిగత విభాగంలో రూపొందించిన స్మార్ట్ అండ్ షేవ్ అగ్రికల్చర్ అనే ప్రాజెక్ట్ కూడా ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 3వవారంలో పుదుచ్చేరిలో జరగబోయే దక్షిణభారత స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనకు ఈరెండు ప్రాజెక్టులు ఎంపికవటం సంతోషదాయకమని డీఈవో తెలిపారు. ఈప్రాజెక్టులను రూపొందించిన పాఠశాల విద్యార్థులను గైడ్ టీచర్‌లను, ప్రధానోపాధ్యాయులను డీఈవో అభినందించారు. అభినందనలు తెలియజేసినవారిలో సమగ్రశిక్ష ఏపీసీ ఎం నాగిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాధిక్, డీవైఈవోలు తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందిన మహిళ సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం పంపిణీ చేశారు. మండలపరిధిలోని ఐలవరం గ్రామానికి చెందిన జొన్నాదుల విజయలక్ష్మి అనారోగ్యంతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందింది. ఆర్థిక పరిస్థి తి అంతంత మాత్రం కావడంతో ఎమ్మెల్యే ఆనందబాబును సంప్రదించి వైద్యానికి అయిన ఖర్చు వివరాలను తెలియపరచగా, స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో బాధితురాలికి అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

● డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అకౌంట్స్ డీఎన్ మోహనరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అకౌంట్స్ డీఎన్ మోహనరావు

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అకౌంట్స్ డి.ఎన్.మోహనరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాపట్ల తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం పెన్షనర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బాపట్ల శాఖాధ్యక్షుడు వైవీ నరసింహారావు అధ్యక్షత వహించగా మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కమ్యూటేషన్ రికవరీ నిలుపుదలకు ఉత్తర్వులిచ్చినట్లు గుర్తుచేశారు. పెన్షనర్ల సాధారణ సమస్యలైన ఫ్యామిలి పెన్షనర్లకు సంబంధించిన పుట్టినతేదీ పేర్లలో సవరణ వంటి వాటిని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. ఉత్తర్వులు త్వరలో వస్తాయని చెప్పారు. రాష్ట్ర సంఘ కోశాధికారి పి.నాగరాజు, టి.వెంకటరంగం, ఎల్.మాణిక్యారావు, విశ్వేశ్వరరావు, శివబ్రహ్మం, టి.వల్లయ్య, మహదేవ్, కృష్ణప్రసాద్, వీరభద్రయ్య, కె.శైలజలను సన్మానించారు. నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించారు.

పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా బ్రహ్మాండం బాలనారాయణ



బ్రహ్మాండం బాలనారాయణకు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా నియామక పత్రం అందజేస్తున్న యడ్లపాటి స్వరూపరాణి తదితరులు

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా బ్రహ్మాండం బాల నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా బుధవారం బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి యడ్లపాటి స్వరూపరాణి సహాయ ఎన్నికల అధికారి జగన్నాథశాస్త్రి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, పట్టణ ఎన్నికల అధికారి అడపాల శ్రీరామయ్యలు బాలనారాయణను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. మాజీ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్‌తో కలిసి ఆయనకు నియామకపత్రం అందజేశారు. అదేవిధంగా పట్టణ ప్రతినిధిగా సీనియర్ నాయకుడు బి.బాబునాగేంద్రకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, నాళంనరేష్, గుండ్రెడ్డి శ్రీహరి, తిలక్, కొత్రా రామకృష్ణ, నరాలశెట్టి శ్రీనివాస్, కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, బాలాజీ, భావన్నారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **నగరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):** బీజేపీ మండల అధ్యక్షుడిగా జొజ్జవరపు సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక జిల్లా రిటర్నింగ్ అధికారి యడ్లపల్లి స్వరూపారాణి సహ రిటర్నింగ్ అధికారి రాంపల్లి జగన్నాథశాస్త్రి, మండల రిటర్నింగ్ అధికారి బేతపూడి వెంకటేశ్వరరావుల సమక్షంలో జరిగింది.

గ్రామాల్లో సంక్రాంతి శోభ

- పిండి వంటల ఘుమఘుమలు
- అరిసెలు, లడ్డూ తయారీలో మహిళలు
- హరిదాసుల సందడి
- గ్రామాలకు చేరుకుంటున్న బంధువులు



సంక్రాంతికి సిద్ధమైన అరిసెలు, లడ్డుల, పూస మిఠాయి

గ్రామాల్లో సంచరిస్తున్న హరిదాసు



వట్టిచెరుకూరులో సంక్రాంతికి అరిసెలు వండుతున్న గృహిణులు





వట్టిచెరుకూరులో చెక్కలు తయారు చేస్తున్న మహిళలు



వట్టిచెరుకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సమీపిస్తున్న నేపథ్యంలో పిండి వంటల తయారీపై గృహిణులు దృష్టి సారించారు. పిండి వంటల ఘుమ ఘుమల గుబాళింపు ప్రతి ఇంట ప్రారం భమయ్యాయి. సంక్రాంతికి సంప్రదాయ బద్ధంగా కొత్తగా పెళ్ళయిన అల్లుళ్ళు, కూ తుళ్ళు, సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నవారు సంక్రాంతికి సొంత గ్రామాలకు చేరుకుంటారు. పిండి వంటల కోసం రెండు మూడు కుటుంబాలకు చెందిన మహిళలు ఒక చోట చేరి ఆయా కుటుంబాలకు అవసరమైన అరిసెలు, లడ్లు, పప్పు చెక్క, బూందీ, కారప్పూస, చెక్కలు వంటి వంటకాలు చేసుకుంటారు. సంక్రాంతి వస్తుందంటేనే ధనుర్మాసం ప్రారంభం నుంచి వంశపారంపర్యంగా వచ్చే హరిదాసులు సంప్రదాయ దుస్తులు ధరించి తలపై కలశం, తుంబురతో మరోచేతిలో భజన చెక్కలను మీటుకుంటూ గ్రామ సంచారం సాగిస్తుంటారు. ఇప్పటికే సంక్రాంతిని పురస్కరిం చుకొని కొన్ని గ్రామా లకు సుదూర ప్రాం తాల్లో నివసించే కూతు ళ్ళు, అల్లుళ్ళు, కుమారులు, కోడళ్ళు, మనువళ్ళు, మనుమ రాళ్ళు గ్రామాలకు చేరుకుంటున్నారు.

హ్యూమన్ మెటా న్యూరో వైరస్ పట్ల ఆందోళన వద్దు

- ఇది ఫ్లూ తరహా తరుణ వ్యాధే
- డీఎంహెచ్‌వో విజయలక్ష్మి వెల్లడి

గుంటూరు మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హ్యూమన్ మెటా న్యూరో వైరస్ (హెచ్‌ఎంపీవీ) గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది సీజనల్ ఫ్లూ తరహా తరుణ వ్యాధని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ప్రజావగాహన కోసం పత్రిక ప్రకటన విడుదల చేశారు. హ్యూమన్ మెటా న్యూరో వైరస్ సాధారణంగా ఐదేళ్ల లోపు పిల్లలకు, 60 ఏళ్లు పైబడ్డ వృద్ధులకు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సోకే అవకాశం ఉంటుందన్నారు. దీనికి విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని, ప్రత్యేక చికిత్సలు అంతగా అవసరం ఉండదని తెలిపారు. ఈ వైరస్‌ను 24 ఏళ్ల కిందటే గుర్తించారని, ఇది కొత్త వైరస్ కాదని ఆమె స్పష్టం చేశారు. వైరస్ ద్వారా సంక్రమించే వ్యాధులకు యాంటీ బయోటిక్ మందులు పని చేయవని, జలుబు, దగ్గుతో బాధపడే వారు ఈ మందులు వాడవద్దని ఆమె సూచించారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం వల్ల హ్యూమన్ మెటా న్యూరో వైరస్ బారిన పడకుండా రక్షణ పొందవచ్చని ఆమె తెలిపారు. తరచూ చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవడం, రద్దీ ప్రాంతాల్లో సంచరించే సమయంలో మాస్కులు . ధరించాలని తెలిపారు. మంచినీరు ఎక్కువగా తీసుకోవడం, తాజా పౌష్టికాహారం తీసుకోవడం, దగ్గు, జలుబు ఉన్న వారికి దూరంగా ఉండాలని డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. ముక్కును, కళ్లను చేతులతో తాకవద్దని, ఇతరులతో కరచాలన చేయవద్దని వివరించారు. దగ్గు, జ్వరంతో బాధపడే పిల్లలను పాఠశాలకు పంపకుండా ఇంటిలో ఉంచి విశ్రాంతి ఇవ్వాలని తెలిపారు. పిల్లలకు సకాలంలో ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ కోరారు.



డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి

రేపు నృసింహుని.. ఉత్తర ద్వార దర్శనం

- బంగారు దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సతీశ్‌కుమార్

వైకుంఠ ఏకాదశి నాడు అన్ని ముఖ్య వైష్ణవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం సంప్రదాయంగా కొనసాగుతోంది. తెలుగు నాట వెంకటాద్రి (తిరుమల), భద్రాద్రి, మంగళాద్రిలో ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అయితే మంగళాద్రి క్షేత్రంలో మాత్రమే ఈ ఉత్సవానికి ప్రత్యేకతతో కూడిన గుర్తింపు వుంది. అత్యంత విలువైన... ఓంకార నాద జనితమైన బంగారు దక్షిణావృత శంఖుతో తీర్థప్రసాదాలను ఇవ్వడం ఈ క్షేత్ర విశిష్టత. ఈ కారణంగానే మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ముక్కోటి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు విశేషంగా తరలివస్తుంటారు.

మంగళగిరి సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి ఉత్తర ద్వారదర్శన భాగ్యం పది గంటలకు పైగా సాగుతుంది. ప్రత్యేకించి ఇక్కడ జరిగే ముక్కోటి వేడుకలకు మరో ప్రాధాన్యం కూడా జతకలిసింది. అత్యంత అరుదైన దక్షిణావృత శంఖు ఒక్క మంగళగిరిలో మాత్రమే ఉంది. దీంతో మంగళాద్రిలో జరిగే శ్రీ లక్ష్మీనృసింహుని ఉత్తర ద్వార దర్శనానికి ఏటా ప్రజలు పోటెత్తుతారు. ముక్కోటి సందర్భంగా 9వ తేదీ గురువారం రాత్రి శ్రీవారిని జగన్మోహినిగా అలంకరించి పుష్పక విమానంపై గ్రామోత్సవం చేస్తారు. ఈ ఉత్సవానికి దుగ్గిరాల మండలం పెదపాలెంకు చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరిస్తున్నారు. అనంతరం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున అంటే పదవ తేదీ శుక్రవారం వేకువజామున మూడు గంటల వరకు శ్రీవారి మూలమూర్తికి తిరువంజనోత్సవం నిర్వహిస్తారు. ఈ తిరువంజనానికి అతి కొద్ది మంది భక్తులను మాత్రమే అనుమతిస్తారు. తిరువంజనం పూర్తవుతుండగానే.. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను బంగారు గరుడ వాహనంపై శోభాయమానంగా అలంకరించి ఉత్తర ద్వారంలోనికి ప్రవేశపెడతారు. ఈ వైకుంఠ దర్శనం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతుంది. ఈ ఉత్సవానికి పెదపాలేనికే చెందిన వాసిరెడ్డి నాగార్జున శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరించనున్నారు. శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కొనసాగుతుండగా.. మరోవైపు ఆలయ ముఖమండపంలో బంగారు దక్షిణావృత శంఖుతో రాత్రి పది గంటల వరకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని మర్నాడు శనివారం కూడా శంకుతీర్థం అందజేయనున్నారు.

ముక్కోటి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ సతీశ్‌కుమార్

మంగళాద్రిలో రెండు రోజులపాటు జరుగనున్న ముక్కోటి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. దేవస్థానం అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ ముక్కోటి ఉత్సవాలకు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, అందు కు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 60వేల మంది భక్తులు శంఖుతీర్థం తీసుకోవచ్చని అంచనా వేసి, వారి కోసం దేవస్థానం వారు ఉచిత క్యూలైను, రూ. వంద, రూ.200, వీఐపీ క్యూలైన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశారన్నారు. 9వ తేదీ రాత్రి నుంచి పదో తేదీ రాత్రి వరకు 300 మంది పోలీసుసిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటారన్నారు. దేవస్థానానికి మూడువైపులా మూడుచోట్ల పార్కింగ్ స్థలాలను కేటాయించామని, భక్తులు పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలుపుదల చేసి నడుచుకుంటూ రావాలని సూచించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్క రూ సహకరించాలని కోరా రు. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, అర్బన్, రూరల్ సీఐలు డి.వినోద్‌కుమార్, వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.





ఉత్సవ గ్రౌండులో ఏర్పాటుచేసిన క్యూలైన్లు, బంగారు దక్షిణావృత శంఖు

ధనుర్మాస వ్రత దీక్షలతో వెయ్యి జన్మల పుణ్యఫలం

- త్రిదండి చినజీయర్ స్వామి

భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి



గుంటూరు(తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసంలో దీక్షలను ఆచరిస్తే వెయ్యి జన్మల పుణ్యఫలం సిద్ధిస్తుందని శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ధనుర్మాసాన్ని పురష్కరించుకుని స్థానిక గోరంట్ల శ్రీవేంకటేశ్వర స్వామి సొసైటీ(పెద్దగుడి)లో బుధవారం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఐదువేల సంవత్సరాల క్రితమే స్వామి వారిని నమ్మి గోదాదేవి పూజలు చేసింది. స్వామివారిని మానవ రూపంలోనే ఆయనకు పూజలు చేసిన పరమభక్తురాలు గోదాదేవి అని తెలియజేశారు. పాండవులు, శబరి, సుగ్రీవుడు దేవుడిని నమ్మి విజయాలు సాధించారు. కౌరవులు, వాలి, రావణాసురుడు, రాక్షసులు నమ్మక పోవడంతో నాశనమయ్యారు. ప్రత్యక్ష, విగ్రహ రూపంలోనైనా దేవుడిని నమ్మాలి. ధనుర్మాసాన్ని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్షలు చేయాలి. అప్పుడే పుణ్యఫలం సిద్ధిస్తుంది. ఈ దీక్షలతోనే మహిళలకు సమాన హక్కులను పది దశాబ్దాల క్రితమే రామానుజ స్వామి వారు కల్పించారు. ఇప్పుడు హక్కుల కోసం మహిళలు పోరాడటం బాధాకరం. రామానుజయ స్వామి కల్పించిన హక్కులతో మహిళలు ఉత్తేజంతో పనిచేయాలని అనుగ్రహ భాషణం చేశారు. అంతకు ముందు స్వామీజీకి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

సాగునీటి ప్రక్షాళనకు శ్రీకారం

- నేడు ప్రాజెక్టు కమిటీ తొలి సమావేశం
- సత్తెనపల్లి జలవనరులశాఖ అతిథి గృహంలో నిర్వహణ
- కీలక నిర్ణయాలు తీసుకుంటేనే మేలంటున్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల ద్వారా ఎన్నికైన సాగునీటి సంఘాలకు కాల్వల బాగు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నీటి సంఘాలు కృషి చేయనున్నాయి. నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ అధికారం చేపట్టాక తొలి సమావేశం గురువారం జరగనుంది. సత్తెనపల్లిలోని జలవనరుల శాఖ అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు అధ్యక్షతన జరిగే సమావేశానికి వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, జలవనరుల శాఖ అధికారులు హాజరుకానున్నారు. సమావేశంలో కాల్వల నిర్వహణ, నీటి సరఫరా, మరమ్మతులు తదితర అంశాలపై చర్చించనున్నారు. అధ్వాన కాల్వలపై సంఘాలు దృష్టి సారించాలి. నీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నడ్డుం కట్టాలి. కాల్వల నిర్వహణలో భాగస్వాములు కావాల్సిన గురుతర బాధ్యతను సంఘాలపై ప్రభుత్వం ఉంచింది. రైతులతో సంఘాలు మమేకం అవుతూ ఎప్పటికప్పుడు నిధులతో సంబంధంలేని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రైతులు ఎన్నో ఆశలు.. ఎంతో నమ్మకంతో సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతుల నమ్మకం వమ్ము కానివ్వకుండా సంఘాల పాలన సాగాల్సి ఉంది. ఈ దిశగా సంఘాలు జలవనరుల శాఖ.. రైతుల మధ్య వారధిగా పనిచేయాల్సి ఉంది. ఏమాత్రం అలసత్వం.. నిర్లక్ష్యం వహించినా సంఘాల ఎన్నికల లక్ష్యం నీరుగారి పోనున్నది. సంఘాలు నీటి సరఫరాలో రైతులకు పూర్తి భరోసాను ఇవ్వాల్సి ఉంది. చివరి భూములకు నీరు అందక పోవడానికి కారణాలను గుర్తిస్తే సదరు సమస్య పరిష్కారం పెద్ద పని కాదన్న వాదన రైతుల నుంచి వ్యక్తమవుతోంది. సంఘాలు అంకిత భావంతో పనిచేస్తే అన్నదాతలకు సాగు నీటి ఇక్కట్లు తప్పినట్లే.

సమావేశం అజెండా..

- డివిజన్ వారీగా జరుగుతున్న పనులు.
- 2025-26 సంవత్సరంలో నాగార్జున సాగర్ కుడికాల్వను సక్రమంగా నడుపుటకు కావాల్సిన, చేపట్టాల్సిన పనులు
- డ్యాంలోని నీటి లభ్యతను బట్టి అనుసరించాల్సిన నీటి నియంత్రణ పద్ధతులు, వారబందీ ఆవశ్యకత.
- కాంట్రాక్టు విధానంలో లస్కర్ల నియామకం.
- తూముల వద్ద షట్టర్లు ఏర్పాటు
- జిల్లాల సరిహద్దులలో నీటి నియంత్రణ ప్రణాళిక
- సభ్యులు ప్రస్తావించే ఇతర అంశాలపై చర్చ

రోజూ వెయ్యి క్యూసెక్కులు వృథా

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా విడుదల చేస్తున్న రోజూ నీటిలో 1,000 క్యూసెక్కుల నీరు వృథా అవుతున్నట్లు జలవనరుల శాఖ లెక్కలు చెబుతున్నాయి. ప్రాజెక్టు నుంచి బుగ్గవాగు లోపు కాల్వకట్టల నుంచి ఊట రూపంలో వెయ్యి క్యూసెక్కుల నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలి. కాల్వలకు నీరు విడుదల చేసేందుకు తూములకు షట్టర్లు లేవు. దీంతో సాగు నీరు వృథాగా వాగుల్లో పారుతున్నది. షట్టర్లు లేని కారణంగా అవసరం లేని సమయంలో నీటి సరఫరాను మైనర్లకు నిలుపుదల చేసే అవకాశం లేకుండా పోతోంది. నీటి వృథాను అరికట్టేందుకు కాల్వలకు షటర్ల ఏర్పాటు తక్షణావసరంగా ఉంది.

మరమ్మతులపై పర్యవేక్షణ అవసరం

కాల్వల మరమ్మతుల పనులను రెండు డివిజన్లలో చేపట్టారు. మరో మూడు డివిజన్లలో పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఈ పనులపై సంఘాల పర్యవేక్షణ ఉంటేనే పూర్తిస్థాయిలో అవి జరిగే అవకాశం ఉంటుంది. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 302 పనులను గుర్తించారు. ఈ పనులకు రూ.17.69 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. పూడికతీత, కంప చెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టాల్సి ఉంది. లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 76 పనులకు వ్యయ అంచనా రూ.4.21 కోట్లు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 101 పనుల వ్యయ అంచనా రూ.4.69 కోట్లు. ఓఅండ్ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 62 పనుల వ్యయ అంచనా రూ3.34 కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనుల వ్యయ అంచనా రూ.3.65 కోట్లు. సిప్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనుల వ్యయ అంచనా రూ.1.78 కోట్లు. అయితే సత్తెనపల్లి, నరసరావుపేట లింగంగుంట్ల ఓఅండ్ఎం, వినుకొండ సిప్ట్ డివిజన్ల పరిధిలోని పనుల టెండర్లను చేశారు. మాచర్ల, లింగంగుంట్ల పనులు జరుగుతున్నాయి.

చిలకలూరి పేట మేజర్ కాలువలో పెరిగిన కంప



మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం



రోటరీ గవర్నర్‌తో కలిసి మొక్కలు నాటుతున్న సభ్యులు

సేవా కార్యక్రమాలలో రోటరీ ముందంజ

మార్టూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవా కార్యక్రమాలలో రోటరీ ముందంజలో ఉంటుందని, రోటరీ సమాజసేవ, వ్యక్తిగత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని రోటరీ జిల్లా 3150 గవర్నర్ కే శరత్ చౌదరి అన్నారు. బుధవారం ఆయన మార్టూరు రోటరీ క్లబ్ చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత స్థానిక వివేకానంద విద్యాసంస్థలో కంటి వైద్య నిపుణులు కే సుబ్రమణ్యం ఆధ్వర్యంలో చిన్నారులు కోసం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం నాగరాజుపల్లి సెంటర్ సమీపంలో ఉపాధిహామీ నిధులతో నిర్మాణం చేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు పక్కనే ఇరువైపులా రోటరీ సహకారంతో చెట్ల పెంపకం కోసం కృషి చేస్తామన్నారు. తొలిగా క్లబ్ సభ్యులచేత కొన్ని మొక్కలను నాటించారు. ఈ రహదారి పక్కనే పూర్తిగా రోటరీ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం చేపడతామన్నారు. ఎఫర్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోటరీ కళాపరిషత్ ద్వారా ఏటా కళా పరిషత్ నాటికలను నిర్వహించడంతో మార్టూరు రోటరీ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఎస్‌కే మహమ్మద్ రఫీ, క్లబ్ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు, కార్యదర్శి మాదాల సాంబశివరావు, కోశాధికారి గరిమిడి శ్రీనివాసరావు, ఇంకా జాష్టి వెంకట మోహనరావు, ఇంటూరి ఆంజనేయులు, జీహెచ్ అంజిబాబు, రావి అంకమ్మచౌదరి, చెరుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

చినగంజాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గత నెల డిసెంబరు 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ సమస్యలకు సంబంధించి రైతులు అందజేసిన అర్జీలను స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం 10, పేరు సరిచేయటకు ఒకటి, 1బీ అడంగల్ కోసం రెండు, భూ సర్వేకు 8 అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పీ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్‌ఐ నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ద్రోణాదులలో 49 అర్జీలు

మార్టూరు : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 49 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టీ ప్రశాంతి తెలిపారు. వాటిలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 21, భూముల సర్వే కోసం 27, దేవదాయ భూములకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ఈవో శిరీషమండల సర్వేయర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు


విజేతలకు బహుమతులను అందిస్తున్న న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో బుధవారం ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చీరాల కోర్టు భవన సముదాయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈసందర్భంగా ముగ్గులు, పోటీలు, మ్యూజికల్ చైర్స్ వంటిపోటీలు నిర్వహించారు. విజేతలకు న్యాయాధికారి సుధ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రమేష్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు. పాపరాజు తోటలోని శ్రీరాఘవేంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ప్రాంగణాన్ని పచ్చతోరణాలతో అలంకరించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డులు మంజూరు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన బాల ఆధార్ నమోదు శిబిరాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఆధార్ కోసం పిల్లల వివరాలను నమోదు చేస్తున్న తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఇంత మోసమా

- పొదిలిలో వైసీపీ మార్క్ మాయాజాలం
- ఎన్నికల వేల హడావుడిగా రక్షిత నీటి పథకం పనులు
- ఉత్తుత్తి అనుమతులు మంజూరు
- టెండర్ల ప్రక్రియ నిర్వహించిన అధికారులు
- వెంటనే ప్రారంభించిన కాంట్రాక్టర్
- ఎం-బుక్ నమోదు కాకపోవడంతో లబోదిబో
- రూ.10కోట్ల పెట్టుబడి పరిస్థితేమిటో..?
- అర్ధంతరంగా ఆగిన పనులు

దర్శి సాగర్ కాలువ నుంచి పైపులైన్ ద్వారా నీటిని తెచ్చుకోవడం పొదిలి ప్రజల చిరకాల స్వప్నం. ఆ కలను తాము నిజం చేస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వం గతంలో డాంబికాలు పలికింది. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి స్వయంగా పనులు ప్రారంభిస్తూ శిలాఫలకం ఆవిష్కరించారు. చోటామోటా నేతల నుంచి ప్రజాప్రతినిధులు వరకు అందరూ అది తమ కీర్తిగా చెప్పుకున్నారు. అనుకున్నదే తడవుగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే ఈ పనులకు అసలు ఆర్థికశాఖ అనుమతే లేదు. దీంతో విషయం తెలిసి కాంట్రాక్టర్ కాడి కిందేశారు. ఇప్పటివరకు రూ.10కోట్ల మేర ఖర్చుపెట్టినట్లు పేర్కొంటున్న అతను తన పెట్టుబడి కూడా వెనక్కు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

పొదిలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సక్రమంగా అనుమతులు తీసుకోకుండా ఎన్నికలకు ముందు హడావుడిగా వైసీపీ ప్రభుత్వ పెద్దలు చేసిన మాయాజాలం పొదిలి ప్రజలకు శాపంగా మారింది. ఏళ్లుగా వెంటాడుతున్న తాగునీటి సమస్య తీరుస్తామంటూ ఆ పార్టీ నేతలు ప్రగల్బాలు పలికి చివరకు చేతులెత్తేశారు. అధికారులు నేతల బాటలోనే సాగారు. పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. తీరా ఎంబుక్ చేసే సమయంలో పథకం బండారం బయటపడింది. దీంతో సదరు కాంట్రాక్టర్ లబోదిబోమంటూ పనులను అర్ధంతరంగా నిలిపేశారు. వివరాల్లోకి వెళితే.. దర్శి సాగర్ కాలువ నుంచి పైపులైన్ ద్వారా పొదిలి పెద్దచెరువుకు నీటిని నింపి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.50.13కోట్ల అంచనాలను ప్రతిపాదించింది. ఈ పనులకు 2022లో పరిపాలన అనుమతులు ఇచ్చింది. దీంతో ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆగమేఘాల మీద టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. 2023 ఏప్రిల్‌లో మార్కాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన అప్పటి సీఎం జగన్ వర్చువల్ విధానం ద్వారా భారీ రక్షితనీటి పథకానికి శిలాఫలకం ఆవిష్కరించారు.

అప్పట్లో భారీగా సంబరాలు

ప్రజల ఆకాంక్షల మేరకు వైసీపీ హామీ ఇచ్చినట్లు రక్షితనీటి పథకాన్ని ప్రారంభించి పొదిలి ప్రాంతప్రజల చిరకాలవాంచ నేరవేర్చామని ఆర్భాటంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి పర్యటన తరువాత స్థానిక వైసీపీ నాయకులు అత్యుత్సాహంగా రక్షితనీటి పథకం తెచ్చిన ఘనత మాదేనంటూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో పెద్ద ఎత్తున ప్రార్థనలు చేసి నానా హంగామా చేశారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టును రఘురామ పైపుల కంపెనీ దక్కించుకుంది. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ పైపులైన్ నిర్మాణ పనులను చురుగ్గా చేపట్టింది. ఇప్పటివరకు రూ.10 కోట్ల మేర పనులు పూర్తిచేశారు. ఇక్కడే కథ మరో మలుపు తిరిగింది. చేసిన పనులకు ఎం-బుక్ రికార్డ్ చేసే సమయంలో ఈ పైపులైన్ వర్క్‌కు అసలు ఆర్థిక శాఖ అనుమతులు లేవని బయటపడింది. దీంతో లబోదిబోమనడం కాంట్రాక్టర్ వంతైంది.


బిల్లులు రాకపోవడంతో అర్ధంతరంగా నిలిచిన పనులు

ఎంబుక్ చేయడం కష్టమే

ప్రభుత్వం ఇచ్చిన జీవో నకలు కిందిభాగంలో ఆర్థిక అనుమతులు ఉన్నట్లు పొందుపరచకపోవడంతో ఎం-బుక్ రికార్డ్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. మరి ఆర్థిక అనుమతులు లేకుండా టెండర్లు పిలవడంపై అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు తెల్లముఖం వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల ప్రక్రియ ఎలా నిర్వహించారని ప్రజలు మండిపడుతున్నారు.

ఎనిమిది నెలలుగా నిలిచిన పనులు

ఎంబుక్ నమోదు కష్టం కావడంతో సదరు కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. ఏడెనిమిది నెలలుగా పనులు నిలిచిపోవడంతో పొదిలి ప్రజల ఆశలు ఆవిరవుతున్నాయి. అయితే ప్రస్తుత శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తిచేయిస్తామని పేర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ఈ విషయం వెల్లడించారు. మొత్తం మీద వైసీపీ ప్రభుత్వం పశ్చిమప్రాంత ప్రజలను మభ్యపెట్టిందనే విషయం తేటతెల్లమైంది. ఒకవైపు పనులు పూర్తికాకుండానే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం వంటి గారడీలు వైసీపీకే చెల్లుతాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే ఉత్తుత్తి జీవోలు

అభివృద్ధి పనులు చేపట్టకుండానే చేసినట్లు చూపి ప్రజలను మభ్యపెట్టడం వైసీపీకే చెల్లుతోంది. వెలిగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం చేస్తున్నామని అప్పటి సీఎం జగన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ఐదేళ్ల పాలనలో కనీసం 10 శాతం పనికూడా చేయలేదు. అదేవిధంగా దర్శి-కొత్తరెడ్డిపాలెం నుండి పైపులైన్ ద్వారా పొదిలి పెద్దచెరువుకు నీరుతెచ్చి మండల ప్రజల నీటి కష్టాలు తీరుస్తానన్నారు. రూ.50.13 కోట్లతో ఉత్తుత్తి జీవో విడుదల చేశారు. ఇప్పుడు ఆ జీవోకు ఆర్థిక అనుమతలు లేవని స్పష్టమైంది. ఇప్పటి కూటమి ప్రభుత్వం పంతాలకు పోకుండా నిధులు విడుదల చేయించి పనులు పూర్తిచేయిస్తాం.

- కందుల నారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

శాఖ నుంచి వచ్చిన జీవో ఆధారంగానే పనులు

గత ప్రభుత్వ పాలనలో ఇరిగేషన్ శాఖ నుంచి రూ.50.13 కోట్లు పైపులైను పనులకు జీవో విడుదలైంది. దాని ఆధారంగానే టెండర్లు పిలిచారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థలకు పార్ట్ పేమెంట్ కోసం ఎం-బుక్ నమోదు చేస్తుండగా ఆర్థికశాఖ అనుమతులు లేవని స్పష్టమైంది. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో అనుమతులు వస్తాయి. పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం.

- ఇరిగేషన్ డీఈ శివరాంప్రసాద్

ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధికి రూ.30లక్షలు మంజూరు



- వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ
- అందుబాటులోకి రానున్న క్రీడా స్టేడియం
- వెల్లడించిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధికి ప్రభుత్వం రూ.30 లక్షల నిధులను విడుదల చేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి పర్చూరులో రూ.2కోట్లతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేసిన క్రీడా స్టేడియంలో ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ ఛైర్మన్ అనిమిని రవి నాయుడుకు లేక రాశా రు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో క్రీడా వికాస కేంద్రాన్ని నిర్మించామని, గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రారంభోత్సవానికి నోచుకోలేదన్నారు. దీంతో మొక్కలతో శిథిలావస్థకు చేరుకుందన్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం అసంపూర్తి పనులు పూర్తి చేయడంతో ఎాటం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, జిమ్, వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ నిర్మాణం కోసం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. వారం రోజుల్లో ఈపనులకు టెండర్లు పిలిచి త్వరితగతిన వినియోగంలోకి తీసుకొస్తామని ఆయన భరోసా ఇచ్చారు. గ్రామీణ క్రీడాకారులను పోత్సహించేందుకు ఎన్టీఆర్ క్రీడా వికాసాన్ని ఏర్పాటు చేశామని, కొద్ది రోజుల్లోనే దీనిని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు.

హైస్కూల్‌కు 50 బెంచీల బహూకరణ


దాతలు బహూకరించిన బెంచీలు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో కొల్లా వీరవసంతరావు జడ్పీ హైస్కూల్‌కు వింజనంపాడు గ్రామానికి చెందిన ఎన్నారై తుమాటి కిషోర్ బెస్ట్ రన్నర్స్ యూఎస్‌ఏ వారు రూ.1.50 లక్షల విలువైన 50 బెంచీలను బహూకరించారు. వాటిని బుధవారం కిషోర్ తల్లి రాజరాజేశ్వరి, సోదరులు శ్రీనివాసు, బాలకృష్ణ హైస్కూల్‌కు అప్పగించారు. దాత లను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు శాలువాతో కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాఘవరెడ్డి, తల్లిదండ్రుల సంఘం అధ్యక్షురాలు రమాజ్యోతి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తుర్లపాటి శ్రీనివాసు, పూర్వ విద్యార్థులు పెడవల్లి రమేష్, ఎం.నరేంద్ర, కొత్తపల్లిరాఘవ, గ్రామస్థులు మురకొండ రోశయ్య, రావి రత్తయ్య, వీరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకోవాలి

చినగంజాం, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : ఉద్యాన రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఏ.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామాంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సాగు చేస్తున్న మామిడి తోటను ఆమె బుధవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికి చెందిన గాజుల జగదీష్ తన రెండు ఎకరాలలో సాగు చేస్తున్న మామిడి మొక్కలను పరిశీలించారు. మామిడి మొక్కలలో అంతర పంటను సాగు చేస్తూ ఆదాయాన్ని పొందడం అభినందనీయమని పీడీ అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం నిధులను ఉద్యాన రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ ద్వారా ఉద్యాన రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఏపీవో లక్ష్మీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు మారుతి, ఎల్.ఏ.ప్రసన్న, టి.రాజశేఖర్, ఎస్.సుదర్శన్, ఫీల్డ్ అసిస్టెంట్ వడ్లమూడి రామకృష్ణ పాల్గొన్నారు.

మోదీకి బ్రహ్మారథం


రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం


విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం


బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.


వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్


బహిరంగ సభకు హాజరైన అశేష జనం

వైసీపీ నిర్లక్ష్యంతో ఆగిన పనులు

- గోతులమయమైన పాతమద్రాస్ రోడ్డు
- బిల్లులు చెల్లించకపోతే చేయలేనన్న కాంట్రాక్టర్
- పాతమద్రాస్ రోడ్డును పరిశీలించిన ఆర్‌అండ్‌బీ అధికారులు


పాతమద్రాస్ రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

ఇంకొల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇం కొల్లు - పర్చూరు పాతమద్రాస్ రోడ్డు ప నులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. రో డ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో ఈ రోడ్డున ప్రయాణిస్తున్న వాహనదారులు నరకం చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం రోడ్డును పరిశీలించా రు. మూడు సంవత్సరాల కిందట ఓ కాం ట్రాక్టర్ రూ.22 కోట్లతో టెండర్ దక్కించుకొని రోడ్డు పనులు ప్రారంభించారు. నేలచప్టాలు ఉన్న చోట కొత్త బ్రిడ్జిలను నిర్మించి కొంతమేరకు పనులు చేసారు. చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లు లు చెల్లించలేదు. దీంతో పనులు నిలిపివేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీనివాసరావు, డీఈ నళిని పరిశీలించారు. కాంట్రాక్టర్‌ను రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరు మిత్రా రాఘవరావుకు సూచించారు. పనులు ప్రారంభించి న నాటికి ఇప్పటికీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని ప్రస్తుతం ఉన్న పరిస్థితులతో ఆ నిధులతో పని చేయడం కష్టమని, కొత్త ప్రతిపాదనలతో మాత్రమే ఈ రోడ్డును పూర్తి చేయగలనని కాంట్రాక్టరు రాఘవరావు అధికారులకు వెల్లడించినట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. పాత బిల్లులు ఇస్తే తప్ప పనులు చేయలేమని కాంట్రాక్టర్ తెగేసి చెప్పినట్లు సమాచారం. కనీసం బ్రిడ్జిల ఏర్పడిన గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎస్‌ఈ శ్రీనివాసరావు ఏఈ శ్రీకాంత్‌ను ఆదేశించారు.

పోలీస్ వర్సెస్ ఎక్సైజ్

- బెల్ట్ షాపుల నిర్వహణలో లైసెన్సీల మధ్య ఆధిపత్య పోరు
- వైన్ షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లు
- చూసీచూడనట్లు వదిలేస్తున్న ఎక్సైజ్ శాఖ
- కన్నెర్ర చేస్తున్న పోలీస్ శాఖ
- రాజకీయ రంగు పులుముకుంటున్న మద్యం వ్యాపారం
- 265 మద్యం సీసాలు పట్టుకున్న వేటపాలెం పోలీసులు

వేటపాలెం(చీరాల), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వైట్ కాలర్ వ్యాపారంలోకి మద్యం దుకాణాలు కూడా చేరాయి. మద్యం దుకాణాలకు సంబంధించి లైసెన్స్‌లు ఎవరి పేరున ఉన్నప్పటికీ అంతిమంగా వారి వెనుక రాజకీయ కోణం దాగి ఉంటుంది. ఇది బహిరంగ రహస్యం. ఇదిలావుంటే మద్యం బెల్ట్ షాపులు అనేవి ఉండకూడదు. ఎంఆర్‌పీల కన్నా అదనపు ధరకు మద్యం విక్రయించకూడదని సాక్షాత్తు సీఎం చంద్రబాబు పదేపదే చెప్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో ఆ మాటలకు అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారులు కట్టుబడి ఉండడం లేదు. తాజాగా వేటపాలెం మండలం కఠారిపాలెంలో బుధవారం 265 క్వార్టర్ మద్యం బాటిల్స్, 25 బీరు సీసాలను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి పట్టుకున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ విచ్చలవిడిగా జరుగుతుందనేందుకు ఇదొక నిదర్శనమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బెల్ట్ షాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఏంచేస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుంటే వైన్ షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లకు సంబంధించి పోలీస్ శాఖ వారు సంబంధీకులకు నోటీసులు ఇచ్చారు. దీనిపై స్పందించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మిండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం వ్యాపారానికి సంబంధించిన నిబంధనలు అమలులో ఎక్సైజ్ వర్సెస్ పోలీస్ అన్నట్లుగా అడుగులు పడుతున్నాయి. జరుగుతున్న పరిణామాలు అందుకు దర్పణం పడుతున్నాయి.

సింగిల్‌గా వద్దు.. సిండికేట్ ముద్దు

చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మొత్తం 24 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో పాలక, ప్రతిపక్షాలకు చెందిన వారు భాగస్తులుగా ఉన్నారు. ఈ క్రమంలో అదనపు సంపాదన కోసం బెల్ట్‌షాపుల నిర్వహణకు తెరతీశారు. అయితే ఎవరికివారు సింగిల్‌గా వెళదామా, సిండికేట్‌గా వెళదామా అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. వీలున్నచోట ఎవరికివారు బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

అన్నదమ్ముల వివాదానికి రాజకీయ రంగు

దీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఇద్దరు అన్నదమ్ముల మధ్య నెలకొన్న వివాదం రాజకీయ రంగు పులుముకుంది. సర్కిల్ పరిధిలో టీడీపీ, జనసేన, కాంగ్రెస్, వైసీపీలకు చెందిన వ్యక్తులు మద్యం దుకాణాల లైసెన్స్ పొందినవారిలో ఉన్నారు. వారికి కొందరికి ఆ అన్నదమ్ముల్లో ఒకరు, మరికొందరికి మరొకరు ప్రాతినిథ్యం వహించేందుకు ముందుకొచ్చారు. అయితే ఆ అన్నదమ్ముల మధ్య ఉన్న విభేదాలతో అది రాజకీయ రంగు పులుముకుంది. ఆ రంగు కాస్తా అధికార పార్టీకి చెందిన కీలక నేతలకు అంటుకుంటుంది.

పోలీస్ X ఎక్సైజ్

వాస్తవానికి మద్యం విక్రయాల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలి. అయితే వారు ఆ విషయాన్ని పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసినవారికి పోలీస్‌శాఖ పరంగా నోటీసులు ఇచ్చారు. తాజాగా కఠారిపాలెంలో బెల్ట్‌షాపులో విక్రయిస్తున్న 265 క్వార్టర్ బాటిళ్లు, 25 బీర్ బాటిళ్లను వేటపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తమ ఇలాకాలో పోలీస్ చర్యలేంటని ఎక్సైజ్ అధికారులు గుర్రగా ఉన్నట్లు సమాచారం.


కఠారిపాలెంలో పట్టుబడ్డ మద్యం సీసాల వివరాలు తెలుపుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

స్వామి కార్యం ఎంత.. స్వకార్యం ఎంత

బెల్ట్ షాపుల నిర్వహణ, అధిక ధరలకు విక్రయాలకు సంబంధించి కొందరు అధికారులు రాజకీయ నాయకలకు అండగా నిలిచారని విశ్వసనీయ వర్గాల భోగట్టా. అయితే అందులో స్వామి కార్యం ఎంత .. స్వకార్యం ఎంత అని విషయం తెలిసినవారు నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత నేతలు జాగ్రత్తగా ఉండకపోతే ఆ మకిలీ వారికి వారికి అంటుకునే ప్రమాదం ఉందనడంలో సందేహం లేదని ఆ రంగంలో ఉన్నవారు అంటున్నారు.


తిరుప్పావై ప్రవచనాలు వినిపిస్తున్న స్వర్ణ అన్నపూర్ణ

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

అద్దంకి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం తిరుప్పావై పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచన కర్త రమాసుందరి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామాలను చదివారు. అమ్మవారికి సారే సమర్పించారు. వివిధ రకాల పండ్లు సమర్పించారు. కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ పూటుకూరి ఉమాఅన్నపూర్ణ, కొల్లిపర లావణ్య, పద్మావతి, శిరీష, విజయలక్ష్మి, అంజలి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

వీనులవిందుగా తిరుప్పావై ప్రవచనాలు

అద్దంకి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుప్పావై ప్రవచనాలు వీనులవిందుగా సాగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానములు ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు జరుగుతున్నాయి. డిసెంబర్ 16 నుంచి ప్రారంభమైన ధనుర్మాస పూజలలో స్వర్ణ అన్నపూర్ణ తిరుప్పావై ప్రవచనాల ను ప్రతి రోజు సాయత్రం విన్పిస్తున్నారు. బుధవారం 24వ పాశురము వివరించారు. ఈ నెల 13వ తేదీ చివరి రోజు భోగి పండుగ సందర్భంగా గోదా కృష్ణుల కల్యాణం జరుగుతుందని స్వర్ణ అన్నపూర్ణ తెలిపారు.

శింగరకొండలో గోవుకు పూజలు

శింగరకొండలోని శ్రీరామస్థూపం వద్ద గోవుకు బుధవారం స్వర్ణ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముప్పవరంలో నేత్ర దానం

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామంలో నేత్ర దానం జరిగింది. గ్రామానికి చెందిన ధూళిపాళ్ల నాగరత్నమ్మ (90) మంగళవారం మృతి చెందింది. ఆమె కుమారుడు భావన్నారయణస్వామి తల్లి నాగరత్నమ్మ నేత్రాలను దానం చేస్తానని రోటరీ ప్రతినిధి జగన్మోహన్‌కు తెలపగా శంకర్ కంటి వైద్యశాల వైద్యులను పిలిపించి దాత కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో ఆమె కుమారులు భావన్నారాయణస్వామి, సత్యనారాయణ, రోటరీ క్లబ్ కార్యదర్శి బత్తుల వీరనారాయణ, క్యాంప్ ఇన్‌చార్జి వీరరాఘవయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఇంకొల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మాక్సీ విజన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో గురువారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి తెలిపారు. ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డు ఉన్నవారికి అన్ని రకాల కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

రేషన్‌షాపులో విజిలెన్స్ తనిఖీ

ఇంకొల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్లలో రేషన్ షాపులో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాప్ నెంబర్-27లో తనిఖీలు చేయగా రిజిస్టర్‌కు, ఉన్న స్టాక్‌కు తేడా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయండి

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య కోరారు. పంగులూరులో బుధవారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో గంగయ్య మాట్లాడుతూ మండలంలోని రామకూరు గ్రామంలో 400 ఎకరాలలో రైతులు వరి సాగు చేశారన్నారు. కోతలు కోసి నూర్పుళ్లు జరుగుతున్నందున ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తలపనేని రామారావు, వినోద్‌బాబు, సుబ్బరాజు, హరిబాబు, ఏలియా, ప్రభాకర్ పాల్గొన్నారు.

మలుపులో క్రషర్ లారీ బోల్తా


బోల్తాపడిన క్రషర్ లారీ

బల్లికురవ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ - సంతమాగులూరు రోడ్డులోని క్వారీల సమీపంలో ప్రమాదవశాత్తు మలుపులో క్రషర్ లారీ మంగళవారం రాత్రి బోల్తా కొట్టింది. అందిన సమాచారం మేరకు బల్లికురవ వైపు వస్తున్న క్రషర్‌కు చెందిన ఖాళీ లారీ మలుపు వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు రోడ్డు కనిపించక పోవడంతో ఒక్కసారిగా మార్జిన్‌లోకి పోనివ్వడంతో లారీ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బయటకు దూకి ప్రాణాలతో బయటపడ్డారు.

వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా ఈదా

వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గునుపూడి నియామకం

అద్దంకి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బాపట్ల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా అద్దంకి మండలం మణికేశ్వరానికి చెందిన మాజీ సర్పంచ్ ఈదా శ్రీనివాసరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అద్దంకి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, ఆర్యవైశ్య నాయకుడు గునుపూడి రఘురామగుప్తాను నియమిస్తూ వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఇద్దరు నేతలకు సమాచారం అందించారు.

పొన్నూరులో అర్చకునిపై దాడి హేయం

జిల్లా అర్చక సంక్షేమ సంఘం

చీరాలటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా పొన్నూరు నాగేంద్రస్వామి దేవాలయంలో అర్చకులు నూతలపాటి నాగేశ్వరశర్మపై దాడి చేయడం హేయమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బాపట్ల జిల్లా అర్చక సంఘం ప్రతినిధులు వాసుదేవ సంపత్‌కుమార్ ఆచార్యులు అన్నారు. రెండు కుటుంబాల మధ్యలో నెలకొన్న వివాదాన్ని ఓ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా దేవాలయంకు వచ్చి అర్చకునిపై దాడి చేసినట్లు ఆరోపించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఆలయంలో రామనామ భజన చేస్తున్న భక్త సమాజం

శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సప్తాహం

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని రామనామం జపిస్తూ సప్తాహ కార్యక్రమం చేపట్టారు. స్థానిక అవధూతేంద్ర భక్త సమాజం ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్న భజన కార్యక్రమంలో పంగులూరు, చందలూరు, జాగర్లమూడివారిపాలెం, ముప్పవరం గ్రామాలకు చెందిన భక్త సమాజ సభ్యులు పాల్గొని భజన చేస్తున్నారు. సప్తాహం ముగింపు సందర్భంగా ఈ నెల 11న ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

కందిలో కాయ తొలుచు పురుగు


కందిని పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ తదితరులు

అద్దంకిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కంది పూత, పిందె దశలో ఉన్నందని, అందులో కాయ తొలుచు పురుగును గమనించడం జరిగిందని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో సాగు చేస్తున్న కంది పంటలను ఏవో వెంకటకృష్ణ, ఉద్యాన అధికారి ఎస్.దీప్తి, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కందిలో కాయ తొలుచు పురుగు నివారణకు న్యూవలరాన్ 10శాతం, ఈసీ 300 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ రఫీ పాల్గొన్నారు.

కత్తెర పురుగును నివారించుకోవాలి

ఇంకొల్లు : మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని నాగండ్ల, సూదివారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పం టను పరిశీలించారు. రబీ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

యద్దనపూడి : రైతులు అందరూ తమ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మేరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని జాగర్లమూడి, పడమర పెద్దివారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పంగులూరు : రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంట సాగు చేపట్టడం లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండమూరు, జనకవరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. సాగులో ఉన్న శనగ పంటను రైతులో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది నవనీతం, దినేష్, రైతులు పాల్గొన్నారు.

రేపు డార్మెటరీ హాల్ ప్రారంభం

అద్దంకి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద దాతలు కంభంపాటి శ్రీనివాసరావు, నాగ జ్యోతి దంపతుల సహకారంతో తమ కుమారుడు కంభపాటి వెంటేష్ డార్మెటరీ హాల్ ప్రారంభోత్సవం ఈ నెల 10వ తేదీ ఉదయం 9-32 గంటలకు జరుగుతుందని ఈవో కోటిరెడ్డి తెలిపారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు డార్మెటరీ హాల్ వినియోగించనున్నట్లు ఈవో కోటిరెడ్డి తెలిపారు.

జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు

- మంత్రి గొట్టిపాటి ఆదేశం
- హద్దులపై మొదులలైన చర్యలు

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని భగవాన్‌రాజుపాలెం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారికి ఇరు వైపులా డ్రైనేజీ ఏర్పాటులో భాగంగా హైవే, రెవెన్యూ అధికారులు హద్దులను నిర్ధారించేందుకు చర్యలు చేపట్టారు. హైవేపై రోడ్డు విస్తరణ సమయంలో డ్రైనేజీ నిర్మాణం జరగలేదు. దీంతో నివాస గృహాల వద్ద వర్షపు నీటితో పాటు మురుగు నీరు ముందుకు పోక రోజుల తరబడి నిలిచి పోవడంతో సమీప ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు తమ ఇబ్బందులను మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వివరించారు. సమస్యపై స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటుకు వీలుగా హ ద్దులు నిర్ధారించేందుకు తహసీల్దార్ సింగారావు, హైవే అధికారులు బుధవారం సర్వే చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, హైవే అధికారులతో పాటు మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


భగవాన్‌రాజుపాలెం వద్ద ఇరు వైపులా హద్దులు నిర్ధారణకు రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పింఛన్ అందలేదని ఎంపీడీవోకు ఫిర్యాదు

సంతమాగులూరు, జనవరి 8 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సజ్జాపురం గ్రామంలో ఆరుగురికి పింఛన్ అందలేదని ఎంపీడీవో జ్యోతిర్మయికి లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

విద్యా బుద్ధులు అలవర్చుకోవాలి


సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రతినిధులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశనుంచే పిల్లలు విద్యా బుద్ధులను అలవర్చుకోవాలని ఈపూరుపాలెం బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం సుధావాణి, ఐటీసీ సభ్యులు మహేష్ అన్నారు. ఐటీసీ ఆధ్వర్యంలో పాఠశాలకు సుమారు రూ.1.50లక్షలు విలువగల డిజిటల్ డ్యాష్‌బోర్డును అందించారు. ఈ డ్యాష్ బోర్డు ద్వారా విద్యార్థులకు బోధన సులువుగా ఉంటుందని చెప్పారు. డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీసీ శ్రీను, ఓఆర్‌డబ్ల్యు అరుణ జ్యోతి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చందలూరులో శాస్త్రోక్తంగా మానుపూజ

పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముత్తయిదువులు

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవ అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. బుధవారం రాత్రి బ్రహ్మశ్రీ వేదమూర్తి వర్యులు చల్లా సత్యనారాయణశాస్త్రి వేద మంత్రాలతో మానుపూజ నిర్వహించారు. గ్రామంలోని పంతంగి వంశస్తులు అమ్మవారికి ఆనవాయితీగా మోయనం సమర్పించగా, మురకొండ వంశస్తులు పసుపు, కుంకుమలతో పాటు వడపప్పు, పానకం మానుపూజ స్థలానికి తోడ్కొని వచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వందలాది మంది ముత్తయిదువులు పంచ మాంగళ్యాలను స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య పింఛన్‌ల పరిశీలన

ఇంకొల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ రూ.15వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం పరిశీలించారు. డాక్టరు అంజలి ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ వైద్యులు బుధవారం పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం 41 మంది ఆరోగ్య పింఛన్‌లు పొందుతున్నారు. ఇంకొల్లులో 19, దుద్దుకూరు పరిధిలో 22 మంది ఉన్నట్లు డాక్టర్ అంజలి తెలిపారు. ఇంకొంల్లు ఆరోగ్య కేంద్రం పరిధిలో నాగండ్ల, ఇడుపులపాడు, వంకాయలపాడు, పూసపాడుతోపాటు ఇంకొల్లులో ఉన్న లబ్ధిదారులను పరిశీలించినట్లు ఆమె తెలిపారు.

నేటి మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో గురువారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ విస్తరణ పనులలో భాగంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- గృహోపకరణాలు, బంగారు వస్తువులు దగ్ధం
- రూ.6లక్షల మేర ఆస్తినష్టం
- రోడ్డున పడిన కుటుంబం

బల్లికురవ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పల్లపు వీరవసంతరావు అను నిరుపేద కుటుంబానికి చెందిన ఇళ్లు దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, బంగారు వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుత య్యాయి. అందిన సమాచారం మేరకు అంబడిపూడి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి పల్లపు వసంతరావు మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళన చెందిన వీర వసంతరావు కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి ఇంట్లో నుంచి పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. ఇల్లు మొత్తం గోడలు కాలి పోయి బీరువాలో ఉన్న నగదు, బంగారు వస్తువులు, వెండి వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.6లక్షల పైబడి అస్తి నష్టం సంభవించిందని బాధితుడు తెలిపారు. మంటలు పెద్దవి కాకుండా ఇరుగు పొరుగు ఉన్న గృహాల వారు వెంటనే మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో తాము కట్టుబట్టలతో బయటపడ్డామని, ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.


కాలిపోయిన గృహోపకరణాలను చూపిస్తున్న ఇంటి యజమాని

తక్షణ సహాయంగా 25కిలోల బియ్యం అందజేత

అంబడిపూడి గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగిన పల్లపు వీర వసంతరావు ఇంటిని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు. తక్షణ సహాయం గా ప్రభుత్వ పరంగా 25కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నాయని బాధితుడు అధికారులకు విన్నవించారు. తదుపరి ప్రభుత్వ ద్వారా వచ్చే పరిహారాన్ని అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వ ర్లు, టీడీపీ నాయకులు దద్దాల అంజయ్య పాల్గొన్నారు.

చందలూరులో అగ్ని ప్రమాదం

మంటల్లో కాలిన సామగ్రి

పంగులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామం వెలుపల పెంట్యాల రామాంజనేయ స్వామి ఓ షెడ్‌లో నిలువ ఉంచిన లక్షల విలువ చేసే రెస్టారెంట్ సామగ్రి మంటలలో కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇది ప్రమాదవశాత్తు జరిగినదిగా అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.


షెడ్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది